RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers



హైదరాబాద్ 22 ఆగస్ట్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:73

# బాబోయ్, ఎకరం రూ.264 కోట్లు..

## రాయదుర్గంలో ఆల్ టైమ్ రికార్డు ధర


**రాయదుర్గంలో ఎకరాకు రూ. 264 కోట్లతో కొత్త భూ రికార్డు**

**ఒక్క ప్లాట్ వేలంతో టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల ఆదాయం**

**గత మే నెలలో నమోదైన రూ. 237 కోట్ల రికార్డు బద్దలు**

**ఐటీ కారిడార్‌లో ఉండటంతో రియల్ ఎస్టేట్ సంస్థల తీవ్ర పోటీ**

**ఆగస్టు 28న మరో ప్లాట్‌కు వేలం జరగనున్నట్లు ప్రకటన**




హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. రాయదుర్గంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (౬+××జ) నిర్వహించిన వేలంలో ఎకరా భూమి ఏకంగా రూ. 264 కోట్లు పలికింది. మొత్తం 5.25 ఎకరాల ప్లాట్ విక్రయం ద్వారా ప్రభుత్వ సంస్థ అయిన టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. హైదరాబాద్‌లో భూమి ధరకు సంబంధించి ఇదే ఆల్ టైమ్ రికార్డ్.

రాయదుర్గం పాన్‌మక్తాలోని సర్వే నెం. 83/1లో ఉన్న ప్లాట్ నెం. ౹ా1 కోసం శుక్రవారం ఈ-వేలం నిర్వహించారు. ఎకరాకు రూ. 175 కోట్ల కనీస ధరతో వేలం ప్రారంభించగా, దానిపై ఏకంగా 50.9 శాతం అధికంగా ధర పలికింది. ఇదే కారిడార్‌లో గత మే నెలలో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ. 237 కోట్లు పలికింది. తాజా వేలంలో ఆ రికార్డు బద్దలైంది.

హైదరాబాద్ ఐటీ, నాలెడ్జ్ సిటీ గ్రోత్ కారిడార్‌లో ఈ భూమి ఉండటం దీనికి ప్రధాన కారణం. ఐటీసీ కోహినూర్ హోటల్‌కు ఎదురుగా, దుర్గం చెరువు, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అత్యంత సమీపంలో ఈ ప్లాట్ ఉంది. మల్టీ-యూజ్ జోన్‌గా ఉన్న ఈ భూమి కోసం పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు తీవ్రంగా పోటీపడ్డాయి. ఈ వేలంలో పాల్గొనేందుకు బిడ్డర్లు రూ. 10 కోట్ల డిపాజిట్ చెల్లించారు.

ఈ భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ చారిత్రక రాతి కట్టడాలు ఉన్నాయని, దుర్గం చెరువుకు సమీపంలో ఉన్నాయని, యాజమాన్య హక్కుల వివాదాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అయితే, వేలం ప్రక్రియను నిలిపివేసేందుకు న్యాయస్థానాలు నిరాకరించాయి. ఈ ప్లాట్లు రక్షిత వారసత్వ ప్రాంతాలు, బఫర్ జోన్ల పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది.

గత కొన్నేళ్లుగా రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. 2025లో ఇక్కడ ఎకరా ధర రూ. 177 కోట్లుగా ఉండేది. ఇప్పుడు అంతకుమించి రికార్డు ధర పలికింది. తాజా డిమాండ్ నేపథ్యంలో, ఇదే సర్వే నంబరులో మరో 5.38 ఎకరాల ప్లాట్‌కు ఆగస్టు 28న వేలం నిర్వహించనున్నట్లు టీజీఐఐసీ ప్రకటించింది. వరుస వేలాలతో రాయదుర్గం

# చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ కారణమా... కేంద్రం కీలక ప్రకటన

**చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ కారణం కాదన్న కేంద్రం**

**తగ్గిన ఉత్పత్తి, పండుగల డిమాండే అసలు కారణమని వెల్లడి**

**గతంతో పోలిస్తే ఇథనాల్‌కు చక్కెర మళ్లింపు తగ్గిందని స్పష్టీకరణ**

**ధరల నియంత్రణకు చర్యలు.. దిగుమతులకు అనుమతి**



దేశంలో చక్కెర ధరలు పెరగడానికి ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడమే కారణమంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ వాదనల్లో ఏమాత్రం వాస్తవం లేదని, ధరల పెరుగుదల వెనుక ఇతర కారణాలు ఉన్నాయని స్పష్టం చేసింది. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఈ అంశంపై వివరణ ఇచ్చింది.

దేశీయంగా చక్కెర ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, పంట నష్టాలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో తలెత్తిన అవాంతరాలే ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని ప్రభుత్వం తెలిపింది. కొందరు వ్యాపారులు అక్రమంగా నిల్వలు చేయడం కూడా దీనికి దోహదం చేసిందని పేర్కొంది. గత నెల రోజుల్లోనే చక్కెర ధర గణనీయంగా పెరిగింది. జూలై 20న కిలో రూ. 48గా ఉన్న ధర, ఆగస్టు 20 నాటికి రూ. 55 మార్కును దాటింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో హోల్ సేల్ మార్కెట్‌లో ధర రూ. 65 దాటగా, రిటైల్ మార్కెట్లో రూ. 70 మార్కును కూడా అధిగమించింది. అయితే, ఈ ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తికి ఎటువంటి సంబంధం లేదని కేంద్రం వెల్లడించింది. ఇథనాల్ తయారీ కోసం చక్కెర మళ్లింపు గతంతో పోలిస్తే తగ్గిందని గణాంకాలతో సహా వివరించింది. 2022-23లో 12 శాతం చక్కెరను ఇథనాల్ కోసం మళ్లించగా, 2025-26 నాటికి అది 9 శాతానికే పరిమితమైందని తెలిపింది. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడో వంతు మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచే వస్తోందని స్పష్టం చేసింది. ధరలను అదుపు చేసేందుకు ఇప్పటికే తగిన చర్యలు ప్రారంభించామని, చక్కెర నిల్వలపై పరిమితులు విధించామని ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా, దేశీయ సరఫరాను పెంచేందుకు సుంకాలు లేని లేదా అతి తక్కువ సుంకంతో కూడిన దిగుమతులకు అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించింది.

# ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ని సందర్శించిన రేవంత్ రెడ్డి



ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు.

సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలు, పాలన, విద్య, ప్రజా విధానాలపై చర్చలు ప్రారంభమయ్యాయి.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి భారతదేశంతోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారు.

# పేదల సంక్షేమం.. భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత

**సెప్టెంబర్ 15లోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి**

**భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.**

**సర్వే మ్యాప్ తో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం**

**ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు**

**జగిత్యాల జిల్లా పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో అర్హులైన లబ్ధిదారులను సెప్టెంబర్ 15లోగా తుది జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి జగిత్యాల జిల్లాలో పర్యటించారు.

ఈ

మిగతా 2 లో

# పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

## పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్

**పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ**

**ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా**

**జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ**

**పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన**

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు.



జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# ప్రజాబలం

## 22 ఆగస్ట్ 2026 శనివారం


## వందేమాతరం తీవ్ర దుమారం

భారత జాతీయ గేయం వందేమాతరం చుట్టూ మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది న్యూఢిల్లీలో నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో, భవిష్యత్‌లో పార్టీ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే బీజేపీ కాంగ్రెస్‌ను లక్ష్యంగా పదునైన విమర్శలతో దాడి చేసింది. ఈ వివాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తమిళనాడులోని చెంగల్పట్టులో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ ప్రయోజనాలను, జాతీయ భావాలను తాకట్టు పెడుతోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిర్ణయం కేవలం రాజకీయ స్వార్థంతో కూడుకున్నదని, ఇది దేశ విభజనకు పునాది వేసిన నాటి విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. మరోవైపు బీజేపీప జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ కాంగ్రెస్‌ను ఏకంగా కొత్త ముస్లిం లీగ్‌తో పోల్చారు.పార్లమెంట్ చేసిన చట్టాన్ని ధిక్కరిస్తూ కాంగ్రెస్ తన పాత విధానాలనే అమలు చేయాలని చూడటం విచారకరమని విమర్శించారు. దేశం గతంలో ఒకసారి వందేమాతరాన్ని రెండు భాగాలుగా విభజించే తప్పును అంగీకరించి తీవ్ర పరిణామాలను ఎదుర్కొంది. ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ మళ్లీ అదే విధమైన రాజకీయాలను ముందుకు తీసుకెళ్తోంది. వందేమాతరాన్ని రచించిన బంకిం చంద్ర ఛటర్జీని, స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను కాంగ్రెస్ అవమానిస్తోంది." అని అమిత్‌షా అన్నారు. రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. " దేశం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన వేలాది మంది అమరవీరులు ఈ వందేమాతర గేయాన్ని తమ శ్వాసగా మార్చుకొని పోరాడారు. అటువంటి పవిత్ర గేయాన్ని అవమానించడాన్ని కాంగ్రెస్ ఇప్పుడు తన అధికారిక పాలసీగా మార్చుకుంది" అని నబీన్ విమర్శించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దేశ ఆత్మగౌరవాన్ని ఓటు బ్యాంకు రాజకీయాల వద్ద తాకట్టు పెట్టారని, అందుకే నేటి కాంగ్రెస్ సరికొత్త ముస్లిం లీగ్‌గా అవతరించినట్టు కామెంట్ చేశారు. ఈ వివాదం ఆగస్టు 15 వేడుకల సందర్భంగా మొదలైంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ సమయంలో ఎంపీ సోనియా గాంధీ వందేమాతరం పూర్తి గేయాన్ని పాడకుండా నిలిపివేయడానికి ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది. అయితే కాంగ్రెస్ ఈ ఆరోపణలను ఖండించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూర్చోవడానికి కుర్చీ వేయమని మాత్రమే సోనియా గాంధీ అడిగారని వివరణ ఇచ్చింది. అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య వందేమాతరం ఆలపించడంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం వివాదానికి మూలాలు దాదాపు 9 దశాబ్దాల క్రితం నాటి కాంగ్రెస్ తీర్మానం. కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ తాము కొత్తగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని 1937 నాటి కాంగ్రెస్ చారిత్రక కమిటీ సిఫార్సులనే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. వందేమాతరం గేయాన్ని బంకిం చంద్ర చటోపాధ్యాయ 1875లో సంస్కృతం, బెంగాలీ భాషల్లో రాశారు. ఇది మొదట 1875 నవంబర్ 7న బంగదర్శన్ అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత 1881లో ఆయన రాసిన ఆనందమఠ్ నవలలో చేర్చారు. ఈ నవల బెంగాల్ ప్రాంతం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు బ్యాక్‌గ్రౌండ్‌లో సాగుతుంది. 1905 నాటి స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం భారతీయుల ప్రధాన సమరనాదంగా మారింది. అయితే 1937 అక్టోబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష చంద్రోస్‌కు రాసిన లేఖలో వందేమాతరం నవల ముస్లింలలో కొన్ని ఆందోళలను కలిగిస్తోందని పేర్కొన్నారు. అదే సమయంలో ఈ అభ్యంతరాలు అధిక శాతం మతోన్మాధులు సృష్టించినవని కూడా నెహ్రూ అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయాన్ని కోరారు. ఠాగూర్ ఈ గేయంలోని మొదటి రెండు చరణాలను, మిగిలిన చరణల నుంచి వేరు చేసి చూడాలని సూచించారు. ఠాగూర్ ఇచ్చిన ఈ సలహాతో 1937 అక్టోబర్‌లో మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వల్లభాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్ వంటి ప్రముఖులతో కూడిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక కీలక తీర్మానం చేసింది. జాతీయ సభలలో వందేమాతరాన్ని ఆలపించేటప్పుడు కేవలం మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని ఆ తీర్మానంలో సిఫార్సు చేశారు. గాంధీ కూడా 1939 జులై నాటి హరిజన్ పత్రికలో వ్యాసం రాస్తూ... స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం హిందూ–ముస్లింలను ఏకం చేసిన గొప్ప సమరనాదం అని పేర్కొన్నారు. కానీ, దీనిని బలవంతంగా రుద్దడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఎవరైనా అభ్యంతం చెబితే సదస్సుల్లో పాడటం నిలిపివేయవచ్చని, వివాదాలకు తావు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు. వందేమాతరం పూర్తి గేయం మొత్తం ఆరు చరణాలు ఉన్నాయి. జాతీయ గేయంగా అధికారిక హోదా పొందిన కేవలం మొదటి రెండు చరణాలు మాత్రమే. ఇందులో దేశ ప్రకృతి అందాలు, నదీ జలాలు, పచ్చనని పంట పొలాలు, ఫలసాయాన్ని వర్ణిస్తూ మాతృభూమికి ప్రణామాలు అర్పిస్తారు. దీనిపై ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. కానీ 3,4, 5, 6 చరణాల చుట్టూ వివాదాలు నడుస్తున్నాయి. మూడో చరణంలో మాతృభూమి రక్షణ కోసం కోట్ల కొద్ది చేతులు కత్తులు పట్టుకొని సిద్ధంగా ఉన్నాయని యుద్ధ సంకేతాలు ఇస్తుంది. నాల్గో ఐదో చరణాలు మాతృభూమిని దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీ దేవీ హిందూ దేవతలతో పోల్చి పూజిస్తారు. ముస్లిం అభిప్రాయం ప్రకారం ఇస్లాంలో కేవలం అల్లా తప్ప మరెవరినీ పూజించకూడదు. మాతృభూమిని దేవతగా ఆరాధించడం ఇస్లాం సిద్ధాంతాలకు విరుద్ధమని వారి వాదన. ఈ వివాదం ఈనాటిది కాదు. గత ఏడాది డిసెంబర్‌లో వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా పార్లమెంటులో చర్చ జరిగింది. లోక్‌సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... నెహ్రూ ముస్లీం లీగ్ ఒత్తిడికి తలొగ్గి వందేమాతరాన్ని కుదించారని ఆరోపించారు 1937లో జిన్నా అభ్యంతరం చెప్పినప్పుడు నెహ్రూ దీనిపై వెనక్కి తగ్గారని మోదీ విమర్శించారు. దీనికి కౌంటర్‌గా ప్రియాంకా మాట్లాడుతూ.. నెహ్రూ రాసిన లేఖలోని పూర్తి భాగాలను ప్రస్తావించారు. ముస్లిం లీగ్ చేస్తున్న ఆందోళనలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని నాడే చెప్పారని గుర్తు చేశారు. అదే సమయంలో వందేమాతరాన్ని బలవంతంగా రుద్దడం మంచిది కాదని విపక్షాలు అభిప్రాయపడ్డాయి. వందేమాతరాన్ని అవమానించం లేదా దాని ఆలాపనను అడ్డుకోవడాన్ని పార్లమెంట్ నేరంగా పరిగణిస్తూ చట్టాన్ని తెచ్చింది. అనంతరం కేంద్రప్రభుత్వం జాతీయ గేయానికి సంబంధించి తొలిసారిగా అధికారిక ప్రోటోకాల్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయంలోని మొత్తం ఆరు చరణాలను ఆలపించడాన్ని తప్పనిసరి చేసింది.

## విశ్వసనీయ వార్తలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

**-- జెన్ జీ పై సోషల్ మీడియా ప్రభావం అదికంగా ఉన్న నేపథ్యంలో యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించాలి**

**-సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలి**

**-- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా**




హైదరాబాద్, ఆగస్టు 21, 2026:డిజిటల్ యుగంలో వేగం కంటే వార్తలో వాస్తవికత, నిష్పక్షపాతం , విశ్వసనీయతే అత్యంత ముఖ్యమని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. "ముందు నిజ నిర్ధారణ చేయాలి.. ఆ తర్వాతే వార్తను ప్రసారం చేయాలి" అని ఆయన జర్నలిస్టులకు సూచించారు.

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్ తాజ్ కృష్ణ లో నిర్వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తొలి జాతీయ సదస్సును గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులకు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా గవర్నర్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు.

మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం మాత్రమే కాదని, సమాజానికి కళ్లు, చెవులు, ప్రజల గొంతుక అని గవర్నర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, సామాజిక భద్రత, వృత్తిపరమైన అభివృద్ధికి ఫెడరేషన్ దోహదపడాలని ఆకాంక్షించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు జర్నలిజానికి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని, అదే సమయంలో డీప్‌ఫేక్స్, ఏఐ రూపొందించిన వీడియోలు, తప్పుడు సమాచారంతో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల బాధ్యత మరింత పెరిగిందన్నారు.

సోషల్ మీడియా ప్రభావంతో జెన్--జీ ఆలోచనా విధానం మారుతోంది -- యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అన్నారు. వేగం కంటే వాస్తవ నిర్ధారణ ముఖ్యం అని పేర్కొన్న గవర్నర్ సోషల్ మీడియా ట్రెండ్స్, ఫేక్ న్యూస్‌కు లోనుకాకుండా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అందించాలనీ జర్నలిస్టులను కోరారు.

సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఫేక్ న్యూస్‌ను ఎదుర్కొనేందుకు డిజిటల్ లిటరసీ, ఏఐ లిటరసీ, ఫ్యాక్ట్ చెకింగ్ వంటి అంశాలపై ఫెడరేషన్ అవగాహన పెంచాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని అరికట్టడం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, మీడియా, సాంకేతిక సంస్థలు, పౌరులందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు.

'నశా ముక్త్ భారత్', 'టీబీ ముక్త్ భారత్' వంటి జాతీయ కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మలచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. తమ రచనలు, వార్తా సంస్థలు, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జర్నలిస్టులను కోరారు.

ఫెడరేషన్ రాజకీయాలకు అతీతంగా సమ్మిళిత, ప్రజాస్వామ్య వేదికగా ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు. జాతీయ సదస్సు భారతీయ జర్నలిజాన్ని మరింత బలోపేతం చేసి, విశ్వసనీయంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దే దిశగా దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు.

కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. దానకిశోర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీ ఎస్. విజయ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ వి. రమేష్, 'ద హిందూ' గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ ఎన్. రామ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు శ్రీ గౌతమ్ లాహిరీ, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం.. భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత





మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మొత్తం ఆరు కార్యాలయాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధునిక వసతులతో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

**సెప్టెంబర్ 15లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక**

జిల్లాలో మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ఎ1, ఎ2, ఎ3 వంటి సాంకేతిక వర్గీకరణల కంటే అర్హతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిజమైన పేదలకు ఇళ్లు అందేలా శాసనసభ్యులు, ఇన్‌చార్జి మంత్రులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు.

వచ్చే నెల సెప్టెంబర్ 15 నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కూడా తుది చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా మరోసారి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు.

**భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

రాష్ట్రంలో చేపడుతున్న భూ రీ సర్వే అత్యంత కీలకమైన కార్యక్రమమని మంత్రి పొంగులేటి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే రీ సర్వే ప్రధాన లక్ష్యమని, అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు.

సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు మ్యాప్ అందిస్తే భవిష్యత్‌లో డిస్ప్యూట్‌లకు అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ఇది రెవెన్యూ శాఖలో కొత్త శకానికి నాంది పలికే కార్యక్రమమని, కలెక్టర్లకు అనుభవంతో కూడిన ఉన్నత సవాలు అని అన్నారు.

సర్వే నిర్వహించే సర్వేయర్లకు నిర్ణీత మొత్తాన్ని ప్రతి 15 రోజులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త విధానాలు**

రిజిస్ట్రేషన్ శాఖలో పాత తరహా విధానాలకు స్వస్తి పలికి ప్రజలకు మరింత సులభతరంగా, పారదర్శకంగా సేవలు అందించే కొత్త విధానాలను తీసుకురాబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసైన్డ్ భూముల అంశంపై శాసనసభలో విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీకి రూ.32 కోట్లతో మౌలిక వసతులు నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. రెండో దశలో పాఠశాల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తామన్నారు. కాలనీలో రేషన్ దుకాణం, బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

జిల్లాలో ఇప్పటివరకు 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 8,079 మంది లబ్ధిదారులకు రూ.227.32 కోట్లు విడుదలైనట్లు కలెక్టర్ వివరించారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రులు ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, చెరువులో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు.

ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఎల్. రమణ, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశంలో ఫ్యాన్ రెక్కలు కకావికలం

ఒంగోలు, ఆగస్టు 21రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయాయి. 2024 ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 8నియోజకవర్గాల్లో 6 స్థానల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. అప్పటివరకు అధికారంలో వున్న వైసీపీ కేవలం రెండు చోట్ల మాత్రమే అతి కష్టం మీద గెలిచింది. ఒంగోలు పార్లమెంట్ స్థానంలో కూడా టీడీపీ జెండా ఎగరేసింది. ఇది అందరికీ తెలిసిందే. ఈ రెండేళ్ల కాలంలో టీడీపీ బలం ఏమాత్రం తగ్గిన దాఖలాలు లేవు. వైసీపీ పుంజుకున్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఇంకా చెప్పాలంటే ఘోర ఓటమి నుంచి వైసీపీ ఇంకా కోలుకోలేదు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి నాయకత్వం లేకుండా పోయిన పరిస్థితి కనిపిస్తుంది. ఒంగోలు పార్లమెంట్ కు కనీసం ఇంచార్జిని కూడా నియమించుకోలేని దీనస్థితిలో కొట్టు మిట్టాడుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాలుగు రోజులు హడావుడి చేసినప్పటికి ఇప్పుడు ఇటు వైపు తొంగిచూడటం లేదు. ఈసారి ఎన్నికల్లో కొత్తగా అభ్యర్థిని వెదుక్కోవాల్సిన దుస్థితి వుంది. ఇక ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయాక కార్యకర్తలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. చుండూరి రవిబాబు ఇంచార్జిగా పనిచేస్తున్నప్పటికీ పార్టీ శ్రేణులకు నమ్మకం కలిగించలేక పోతున్నాడు. కొండపి నియోజకవర్గంలో మరో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇష్టం లేని కాపురం చేస్తున్నారు. మాటి మాటికీ పాత ఇంటి వైపు తొంగి చూస్తున్నారు. గిద్దలూరులో కుందూరు నాగార్జున రెడ్డి పరిస్థితి కూడా అంతే. ఆయనకు మార్కాపురం మీదనే మనసుంది.గిద్దలూరులో పోటీ చేస్తే గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అన్నా రాంబాబు మార్కాపురం వదిలి పెట్టనని మంకు పట్టు పడుతున్నారు. ఎర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కు ఆదిమూలపు సురేష్ తలనొప్పిగా తయారయ్యాడు. దర్శిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్ కు పార్టీలో సమస్య లేదు కానీ టీడీపీ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. కనిగిరిలో దద్దాల నారాయణను బలవంతంగా కొనసాగిస్తున్నారని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 27న ఇందిరా పార్క్ వద్ద టీ. జి. ఇ (జె. ఏ. సి )ధర్నా




హైదరాబాద్ సిటీ పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు 27-08-2026న ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై, మన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని టీజీఏ (జె. ఏ. సి )హైదరాబాద్ సిటీ బాడీ పిలుపునిచ్చింది.

మన హక్కుల కోసం -- మన డిమాండ్ల సాధన కోసం -- ఐక్యంగా పోరాడుదాం!

కటుకూరి శ్రీకాంత్ -- చైర్మన్

గందూరి వెంకట్ -- కన్వీనర్

పీ. లక్ష్మణ్ రావు । నరేందర్ । శ్రీనివాస్ । సి.హెచ్. వెంకటేశ్వరావు । మహ్మద్.అతీఖ్ పాషా । పి.సురేందర్ రెడ్డి । బి.సంతోష్ । మహేష్ । కె.బాల నర్సింగ్ రావు

టీజీఏ (జె. ఏ. సి )హైదరాబాద్ సిటీ బాడీ




హైదరాబాద్ సిటీ పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీ. జి. ఇ (జె. ఏ. సి )రాష్ట్ర బాడీ పిలుపు మేరకు ఆగస్టు27న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీజీఇ (జె. ఏ. జ)హైదరాబాద్ సిటీ బాడీ ప్రకటించింది.

ఈ సందర్భంగా శుక్రవారం రోజున జరిగిన టీజీఏ (జె. ఏ. సి )హైదరాబాద్ సిటీ బాడీ సమావేశంలో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణపై చర్చించారు.

ప్రధాన డిమాండ్లు:

2వ పి. ఆర్. సి ని వెంటనే అమలు చేయాలి.

పెండింగ్‌లో ఉన్న 6 విడతల డి ఏ డ డి ఆర్ ను వెంటనే విడుదల చేయాలి.

సీపీఎస్ ను రద్దు చేసి ఒపీఎస్ ను పునరుద్ధరించాలి.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి.

నూతన ఇ.హెచ్. ఎస్ ను సమర్థవంతంగా అమలు చేయాలి.

హెచ్ డి ఉద్యోగులకు సెక్రటేరియట్‌లో 12.5% కోటాను వెంటనే అమలు చేయాలి.

## గ్లోబల్ స్థాయిలో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణ -సిఎస్ సంజయ్ జాజు



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ -- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ -- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు.

అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర--సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు.

సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్ పో (జుఇఃజూశీం)లను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు.

అలాగే, తెలంగాణ రైజింగ్ -- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి (ూాఁజఱంశీతీఎ జశీబఅఎఱఅశ్రీ)ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ శ్రీ కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ శ్రీ అజిత్ రెడ్డి, శ్రీ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## కీర్తిశేషులు రాగం సుజాత యాదవ్ దశదినకర్మలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించిన జాతీయ బీసీ అధ్యక్షుడు ఆర్ కృష్ణన్న మరియు బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్





హైదరాబాద్ శేర్లింగంపల్లి నల్లగండ్ల వర్టెక్స్ కింగ్స్టన్ పార్క్ విల్లాస్ విల్లా నెంబర్ 224 తమ స్వగృహంలో రాగం సుజాత యాదవ్ గారి దశదినకర్మ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి అధ్యక్షుడు ఆర్ కృష్ణన్న మరియు బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ గారు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాగం సుజాత యాదవ్ మృతి చెందడం మహిళా లోకానికి తీరని లోటు అని అన్నారు. ఎంతో చురుకుగా చాకచక్యంగా పనిచేసే ఆమె ఇంత చిన్న వయసులో మరణించడం బాధాకరం అని అన్నారు. బీసీలలో ఓ మంచి నాయకురాలని కోల్పోయామని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు.బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రాగం సుజాత యాదవ్ ఎంతో ప్రతిభగల వ్యక్తి అని ప్రజాసేవకురాలని బీసీ మహిళలకు ఆదర్శనీయమని అన్నారు. కొందరు మరణించిన అందరిలో బతికే ఉంటారు అలాంటి కోవకు చెందిన వ్యక్తి రాగం సుజాత యాదవ్. ప్రజా సేవలో క్రియాశీలకంగా పని చేస్తూ తనకంటూ గొప్ప గుర్తింపును సాధించుకొని ఇంకా ఎంతో సాధించాల్సిన సమయంలో ఇలా లోకాన్ని విడిచి వెళ్లిపోవడం అభిమానించే ప్రతి వ్యక్తికి తన ద్వారా స్ఫూర్తి పొందిన ప్రతి వ్యక్తి తన సేవను పొందిన ప్రతి వ్యక్తికి శోకనీయం. ఆమె ఎక్కడున్నా యే లోకాన ఉన్న ఎల్లప్పుడు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా ఆ భగవంతుని కోరుకుంటున్నాను అని అన్నారు. ప్రతినిత్యం ప్రజాసేవలో ఉంటూ ప్రజల కొరకు పని చేసే కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తన సతీమణిని కోల్పోవడం తీరని శోకాన్ని మిగిల్చిందని ఆయన బాధకి ప్రత్యామ్నాయం లేదని ఆయనకు ఆ భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య , భేరి రామచందర్ యాదవ్, బీసీ యువ నాయకులు రవీందర్ గౌడ్, బీసీ విద్యార్థి విభాగం నాయకులు మోడీ రాందేవ్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, సందీప్ యాదవ్, రాజు ముదిరాజ్, నవీన్ యాదవ్, బీసీ కులాల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిపురం హరికృష్ణ చారి, రజక సంఘం కృష్ణ, నాయి బ్రాహ్మణ సంఘం శేర్లింగంపల్లి అధ్యక్షులు సాయిలు, కురుమ సంఘం శేరిలింగంపల్లి అధ్యక్షులు శ్రీశైలం కురుమ, మరియు ప్రజా ప్రతినిధులు మాజీ మినిస్టర్లు ఎమ్మెల్సీలుఎంపీలు ఎమ్మెల్యేలు వివిధ పార్టీల నాయకులు వివిధ సంఘాల నాయకులు రాగం కుటుంబ సభ్యులు రాగం నాగేందర్ యాదవ్ బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని రాగం సుజాత యాదవ్ గారికి నివాళులర్పించినారు

## ఘనంగా హైదరాబాద్ లో సస్టెయిన్‌ఎక్స్ 2026 సదస్సు




హైదరాబాద్: స్థిరమైన అభివృద్ధి, బాధ్యతాయుత నాయకత్వం, భవిష్యత్‌కు సిద్ధమైన సంస్థల నిర్మాణంపై సమగ్ర చర్చలకు వేదికైన సస్టెయిన్‌ఎక్స్ (SustainX) వార్షిక సదస్సు 2026 హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (టీఎఫ్ఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సంస్థల ఉన్నతాధికారులు, నిపుణులు, సామాజిక రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సుస్థిరతను కేవలం పర్యావరణ పరిరక్షణకే పరిమితం చేయకుండా ఏఐ సాంకేతికత, సంస్థాగత నాయకత్వం, మౌలిక వసతులు, సుస్థిర కొనుగోళ్లు, భవిష్యత్ కార్యాలయాలు, ఆరోగ్య రంగం, సీఎస్ఆర్, పౌర సేవలు, సుస్థిర పర్యాటకం వంటి విభిన్న అంశాలపై జరిగిన చర్చలు సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీఎఫ్ఎంసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాథల సత్యనారాయణ స్ఫూర్తిదాయక ప్రసంగంతో సదస్సు అధికారికంగా ప్రారంభమైంది.

జీసీసీ కాన్‌క్లేవ్ ప్రత్యేక ఆకర్షణ నిలిచింది.

సుస్థిర సంస్థల నిర్మాణంలో జీసీసీల మారుతున్న పాత్ర” అనే అంశంపై విస్తృత చర్చ జరిగింది. హైదరాబాద్‌లో మౌలిక వసతుల భవిష్యత్తుపై పర్యావరణ పరిరక్షణపై ఐఏఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల (ITE&C) శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టిఅనుదీప్ అభివృద్ధిదారులను ప్రోత్సహిస్తూ ప్రసంగించారు. అలాగే ప్రొక్యూర్‌మెంట్ కాన్‌క్లేవ్‌లో విలువ, మౌలిక వసతుల స్థిరత్వం, సుస్థిర కొనుగోళ్లపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ప్రజలు, సాంకేతికత, ఆరోగ్యం, సామాజిక బాధ్యత అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. నటుడు డాక్టర్ భద్రం, ఆరోగ్య భద్రతపై నిర్వహించిన వన్ లైఫ్ సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది. హెచ్ఆర్ కాన్‌క్లేవ్‌లో భవిష్యత్ కార్యాలయాలపై చర్చలు జరిగాయి. కిమ్స్ హాస్పిటల్స్ ప్రతినిధులతో ఆరోగ్య రంగ నాయకత్వంపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు.

సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం

సీఎస్ఆర్ కాన్‌క్లేవ్‌లో బాధ్యతాయుత నాయకత్వంతో బలమైన సమాజ నిర్మాణంపై చర్చ జరిగింది. సర్వేజన ఫౌండేషన్ కార్యక్రమాలపై ప్రజెంటేషన్‌తో పాటు సామాజిక కార్యక్రమాలపై ప్రత్యేక ప్రసంగాలు జరిగాయి. టీఎఫ్ఎంసీ కేర్స్ ఆధ్వర్యంలో ‘సపోర్ట్ ది గర్ల్ చైల్డ్’ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

యాదాద్రి, పోచంపల్లి ప్రాంతాలను సుస్థిర పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసే అవకాశాలపై కూడా ప్రత్యేక ప్రదర్శనలు జరిగాయి. సాయంత్రం లాయిడ్స్‌కు చెందిన ఎలిజబెత్ ప్రత్యేక ప్రసంగం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు సివిక్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేయగా, కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ లీడర్‌షిప్ టాక్ నిర్వహించారు.

సాంకేతికత, సంస్థల అభివృద్ధి, సేవా నాణ్యత, బాధ్యతాయుత వృద్ధి అంశాలపై అనుదీప్ దురిశెట్టి దిశానిర్దేశం చేశారు. సదస్సు ముగింపు సందర్భంగా వ్యాపార ప్రదర్శనలు, నెట్‌వర్కింగ్ జోన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యూజన్ డ్యాన్స్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ విధానాలు, పరిశ్రమ, సాంకేతికత, మౌలిక వసతులు, ఆరోగ్యం, సీఎస్ఆర్, పౌర సేవలు, పర్యాటకం వంటి రంగాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సుస్థిర ఆలోచనలను కార్యాచరణాత్మక భాగస్వామ్యాలుగా మార్చడమే సస్టెయిన్‌ఎక్స్ 2026 ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాలు సన్నద్ధం: మంత్రులు తుమ్మల, సీతక్క, వాకిటి శ్రీహరి

### రాజేంద్రనగర్‌లో ని TGIRD లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్
### నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి
### ప్రతి గ్రామ పంచాయతీకి వెబ్సైట్ ను ఆవిష్కరించిన మంత్రులు
### గ్రామానికి సంబంధించిన సమగ్ర వివరాలు వెబ్ సైట్ లో ఉంచే ఏర్పాట్లు

రాజేంద్రనగర్, ఆగస్టు 21:ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డా. ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి తెలిపారు. రైతాంగానికి, రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల కంటే ముందుగానే ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ



ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని పేర్కొన్నారు.

రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీలో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం, వివిధ ప్రభుత్వ రంగాల్లో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ దానకిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, అనిమల్ హస్బెండరు సెక్రటరీ ఇలమ్ బర్తి , టీజీఐఆర్డీ సీఈవో నిఖిల హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాష, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి కొర్ర లక్ష్మి, ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీఓలు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని కేవలం విపత్తుగా చూడకుండా ముందస్తు ప్రణాళికతో అవకాశంగా మలుచుకోవాలని మంత్రులు సూచించారు. గ్రామస్థాయిలో ప్రతి శాఖకు విడివిడిగా కాకుండా వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, స్వల్పకాలిక అవసరాలతో పాటు వచ్చే ఐదు, పది సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులను ఎంపిక చేయాలని సూచించారు.

వీబీ-జీ రామ్‌జీ నిధులను యాదృచ్ఛికంగా కాకుండా ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని, ఉపాధి హామీ నిధులతో శాశ్వత సామాజిక ఆస్తులను నిర్మించాలని మంత్రులు సూచించారు. నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి గ్రామానికి ఊట కుంట వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని అన్నారు. పంట కుంటల ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు వ్యవసాయం, చేపల పెంపకం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు ప్రజల భాగస్వామ్యంతో, గ్రామసభల నుంచే రూపొందాలని, ప్రతి పనికి జియో ట్యాగింగ్ చేయాలని, ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడే, ఒకే పనితో అనేక ప్రయోజనాలు కలిగే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

**మంత్రి సీతక్క**

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాలను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలని,



జీపీఎస్‌ఏపీ కేవలం ఒక డాక్యుమెంట్ కాదని, అది గ్రామ భవిష్యత్తు అభివృద్ధికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు గ్రామసభల నుంచే రావాలని, ఐదు, పది సంవత్సరాల దృష్టితో గ్రామాల భవిష్యత్తును ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని వనరులు, అవసరాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాఖల మధ్య సమన్వయంతో ఒకే పనికి అనేక ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న క్షేత్రస్థాయి అధికారులు రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే గ్రామాల్లో వేల సంఖ్యలో మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపనలు చేశారని, వాటి నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి గ్రామ పంచాయతీకి వెబ్‌సైట్‌ను మంత్రులు, సీఎస్ ప్రారంభించారు. గ్రామంలోని వనరులు, అవసరాలు, చేపట్టాల్సిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు ఇందులో ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

గ్రామస్థాయిలో అనుబంధం ఉన్న అన్ని శాఖలను ఏకతాటిపైకి తీసుకువచ్చి సమావేశం నిర్వహించడం అభినందనీయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో కూడా అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేయాలని, తమ కోసం అధికారులు కష్టపడి పనిచేస్తున్నారనే నమ్మకం ప్రజల్లో కలిగించాలని అన్నారు. ప్రజల మేలు కోసం పనిచేసే అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు.

ఉపాధి హామీ నిధులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాలని, నీటి సంరక్షణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినోను ఆపడం మన చేతుల్లో లేకపోయినా, దాని ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మన చేతుల్లోనే ఉందన్నారు.

భారీ ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ సుమారు 30 లక్షల బోర్లపై సాగు ఆధారపడి ఉందని, అందువల్ల భూగర్భ జలాలను పెంచే పనులను ఉపాధి హామీ ద్వారా విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని, గత రెండేళ్లలో లక్ష ఎకరాల్లో పామాయిల్ సాగును పెంచామని, ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలను పెంచడమే లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు.

**మంత్రి వాకిటి శ్రీహరి**

గతంలో కూడా దేశం ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొందని, 1951 నుంచి ఇప్పటి వరకు భారత్ 12 సార్లు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కరువును ఎలా ఎదుర్కోవాలో రైతులకు అవగాహన ఉన్నప్పటికీ, ఆ అవగాహనను ఆచరణలో పెట్టేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావచ్చని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణతో ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని, తెలంగాణ కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.

కరువు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చేపల పెంపకానికి అవసరమైన నీటిని అందుబాటులో ఉంచేందుకు చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయాలని సూచించారు. మేకలు, గొర్రెల మేత కోసం ప్రత్యేక ప్రాంతాలను గుర్తించి కేటాయించడం ద్వారా పశుసంపదను పెంచుకోవచ్చన్నారు.

ఎలాంటి కరువు పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందుకు సాగే రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలని, భరోసా కల్పించాలని అన్నారు. ముందస్తు ప్రణాళికతో తెలంగాణను దేశానికే ఒక మోడల్‌గా నిలపవచ్చని పేర్కొన్నారు.

**సీఎస్ సంజయ్ జాజు**

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ



రాష్ట్రంలో విస్తృతంగా వరి సాగు ప్రారంభమైందని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. ఇంకా సుమారు 20 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.

సెప్టెంబర్‌లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పెరి-అర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యానవనం, పూల సాగును ప్రోత్సహించాలని, వాటికి అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

వీబీ-జీ రామ్‌జీ ద్వారా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో పక్కా ప్రణాళిక ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వర్క్‌షాప్‌కు హాజరైన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ఎంపీ వేం నరేందర్‌రెడ్డి**

ప్రజలకు అవసరమైన పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. కేవలం టార్గెట్లు పూర్తి చేయాలనే ఉద్దేశంతో అవసరం లేని పనులు చేపట్టవద్దని సూచించారు.

వీబీ-జీ రామ్‌జీ కింద కేవలం రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే పరిమితం కాకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పనులు చేపట్టాలని అన్నారు. రైతులు వేసిన పంటలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, క్షేత్రస్థాయిలో విస్తృతంగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు.

గ్రామాల రూపురేఖలు మార్చే విధంగా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని ఆయన అన్నారు.

వర్క్‌షాప్‌లో పలువురు సర్పంచులు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సహకారం గురించి వివరించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి గ్రామ పంచాయతీకి ఒక వెబ్సైట్ కార్యక్రమాన్ని మంత్రులు ఆవిష్కరించారు. ఆ గ్రామానికి సంబంధించిన సమగ్ర వివరాలు అందులో పొందు పరచనున్నారు. గ్రామ జనాభా, అవసరాలు వనరులు, గ్రామ అభివృద్ధి ప్రణాళిక, శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు వంటి సమగ్ర వివరాలు వెబ్సైట్లో అందుబాటులో ఉంచనున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని గ్రామ పంచాయతీల సమగ్ర వివరాలు అందుబాటులో ఉండే విధంగా ప్రతి గ్రామానికి ఒక వెబ్సైట్ను సిద్ధం చేస్తున్నామ్మనారు. గ్రామా అభివృద్ధికి సంబంధించిన నిధులు అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించి తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలో అగ్రగామిగా, స్వయం సమృద్ధిగా, అనుబంధ శాఖలతో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు.

## పొలిటికల్ ఆడిటింగ్ పూర్తి ? విజయసాయిరెడ్డి పార్టీ టార్గెట్ ఇదే !

నెల్లూరు, ఆగస్టు 21 రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు.రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అయితే, వైఎస్సార్‌సీపీలో నంబర్ టూగా చక్రం తిప్పి, దేశంలోనే అగ్రశ్రేణి ఆడిటింగ్ మాస్టర్‌గా పేరొందిన విజయసాయిరెడ్డి.. కేవలం ప్రజాసేవ కోసమే కొత్త దుకాణం తెరుస్తున్నారంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. రాజకీయాల్లో సొంత పార్టీ నడపడం అంటే ఆర్థికంగా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారమని తెలిసినా ఆయన ఈ అడుగు వేస్తున్నారంటే, ఆ పెట్టుబడి వెనుక అంతకుమించిన భారీ ప్రయోజనాలు, సరికొత్త లెక్కలు దాగి ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ సరికొత్త రాజకీయ ప్రయోగం వెనుక ప్రధానంగా వినిపిస్తున్న వాదన వ్యక్తిగత, వ్యాపార రక్షణ కవచం . గత ఐదేళ్ల పాలనలో విశాఖపట్నం భూముల వ్యవహారాలు, దసపల్లా భూ వివాదాలు, లిక్కర్ లావాదేవీలు, అనేక ఆస్తుల క్రయవిక్రయాల్లో ఆయనపై లెక్కలేనన్ని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఫైళ్లు తిరగదోడే ప్రమాదం ఉండటం, మరోవైపు సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసుల విచారణలు కొనసాగుతుండటంతో.. కేవలం సాధారణ పౌరుడిగా ఉంటే చట్టపరమైన ఉచ్చు బిగుస్తుందన్న భయం ఆయనను వెంటాడుతోందన్న ప్రచారం ఉంది. రేపు ఏ విచారణ సంస్థ దర్యాప్తు చేపట్టినా, రాజకీయ కక్షసాధింపు , కొత్త పార్టీ పెట్టినందుకే వేధింపులు అనే ముద్ర వేసి ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందడానికి ఒక రాజకీయ పార్టీ హోదాను రక్షణ కవచంగా వాడుకోవాలన్నదే ఆయన మొదటి వ్యూహం కావొచ్చు.మరో బలమైన రాజకీయ కోణం బీజేపీ పెద్దల గేమ్ ప్లాన్ . ఢిల్లీలోని కమలనాథులతో విజయసాయిరెడ్డికి ఉన్న బలమైన సంబంధాలు అందరికీ తెలిసినవే. ఏపీలో కూటమి బలంగా ఉండటంతో నేరుగా బీజేపీలో చేరడానికి సాంకేతిక, రాజకీయ ఇబ్బందులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా ఒక వర్గం అసంతృప్తి ఓట్లు వైఎస్సార్‌సీపీకి మళ్లీ గంపగుత్తగా పడకుండా నిరోధించేందుకు ఒక ప్రత్యేక టూల్ గా ఈ కొత్త పార్టీని రంగంలోకి దించుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తటస్థంగా ఉంటూనే, తెరవెనుక ఢిల్లీ పెద్దల ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదిపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఇక మూడో కోణం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మైండ్ గేమ్. వైఎస్సార్‌సీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాబల్యం పెరిగి తనను పక్కనపెట్టిన నాటి నుంచి రగిలిపోతున్న విజయసాయిరెడ్డి.. తాడేపల్లి ప్యాలెస్‌కు గట్టి చెక్ పెట్టాలని చూస్తున్నారు. వైఎస్ కుటుంబానికి చెందిన నమ్మకస్తుడైన ఆడిటర్‌గా పార్టీలోని ప్రతి నాయకుడి ఆర్థిక మూలాలు, అంతర్గత బలహీనతలు, క్షేత్రస్థాయి నెట్‌వర్క్ ఆయనకు కొట్టినపిండి. కొత్త పార్టీ వేదిక ద్వారా వైఎస్సార్‌సీపీలోని అసంతృప్త నేతలను, ద్వితీయ శ్రేణి కేడర్‌ను తనవైపు తిప్పుకుని జగన్ ఓటు బ్యాంకును చీల్చగలనని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడ కూడా ఇందులో దాగి ఉండవచ్చని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి క్షేత్రస్థాయిలో నిలబెట్టడం అనేది సాధారణ వ్యవహారం కాదు. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికో లేక బేరసారాల కోసమో పెట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర ఏపీలో ఎన్నో ఉన్నాయి. విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ పాచికల వెనుక ఉన్న అసలు లక్ష్యం ? కేసుల నుంచి ఆత్మరక్షణ కోసమా, బీజేపీ రాజకీయ ప్రయోగమా లేక జగన్‌పై ప్రతీకారమా అన్నది ఆయన పార్టీ అధికారిక ప్రకటన చేసి మొదటి అడుగు వేసిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

### షావుకారు జానకి మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

తాడేపల్లి నటి షావుకారు జానకి మృతిపై మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్ దిగ్భ్రాంతి ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. షావుకారు మృతి తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు. ఏడు దశాబ్దాలకు పైగా తన సినీ ప్రస్థానం సాగింది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి, సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు.

ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి దిగ్గజ నటుల సరసన కథానాయికగా నటించారు. తదనంతరం తల్లి, అమ్మమ్మ, నానమ్మ వంటి పాత్రల్లోనూ తన సహజ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. నంది అవార్డులతో పాటు అనేక పురస్కారాలు ఆమె ప్రతిభకు దక్కిన గౌరవాలు. షావుకారు కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ పరిశ్రమకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని అన్నారు.

# అసెంబ్లీ బహిష్కరణ

# మైలేజ్.. డ్యామేజా...

విజయవాడ, ఆగస్టు 21 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాకూడదని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల తర్వాత సభలో తమకు దక్కాల్సిన ప్రతిపక్ష హోదా విషయంలో న్యాయం జరగలేదన్నది వైసీపీ ప్రధాన వాదనగా ఉంది. ఈ అంశాన్నే కేంద్రంగా చేసుకుని అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. 2024 ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ స్థానాలు మాత్రమే దక్కాయి. కూటమి పార్టీలైన తెలుగుదేశం పార్టీ , జనసేన , బీజేపీ కలిసి భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో శాసనసభలో వైసీపీ సంఖ్యాబలం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత నుంచే ప్రతిపక్ష హోదా అంశం ఆ పార్టీ రాజకీయ చర్చలో కీలకంగా మారింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభలో తమ పార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వం, కూటమి నేతలు మాత్రం ప్రతిపక్ష హోదాకు సంబంధించిన నిబంధనలు, సభలో పార్టీ బలాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ వాదనను అంగీకరించడం లేదు. దీంతో రెండు వైపులా రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. అయితే అసెంబ్లీకి వెళ్లకుండా ఉండటం వల్ల వైసీపీకి రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం కలుగుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాసనసభ ఒక ముఖ్యమైన వేదిక. నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ధరల పెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై అధికార పక్షాన్ని ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష సభ్యులకు ఉంటుంది. అలాంటి అవకాశాన్ని స్వయంగా వదులుకోవడం వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు వైసీపీ తన రాజకీయ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీకి గైర్హాజరైనప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం కొనసాగించవచ్చు. సోషల్ మీడియా, బహిరంగ కార్యక్రమాలు, పార్టీ సమావేశాలను ఇందుకు ఉపయోగించుకునే అవకాశం ఉందిశాసనమండలిలో మాత్రం వైసీపీకి కొంత బలం ఉండటంతో అక్కడి వేదికను ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకవైపు అసెంబ్లీకి దూరంగా ఉంటూ, మరోవైపు మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం అనే ద్వంద్వ వ్యూహం ఆసక్తిని కలిగిస్తోంది. ఇక వరుసగా సభకు గైర్హాజరైతే సభ్యుల హాజరుకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే గైర్హాజరుపై అనుమతులు, సభా విధానాలు వంటి అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉంటాయి. కాబట్టి కేవలం గైర్హాజరు ఆధారంగా సభ్యత్వంపై తక్షణ నిర్ణయం వస్తుందని భావించడం సరికాదు. మొత్తానికి వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం ఆ పార్టీ రాజకీయ వ్యూహానికి పరీక్షగా మారింది. ప్రతిపక్ష హోదా అంశాన్ని ప్రజల్లోకి ఎంత బలంగా తీసుకెళు ంది, అసెంబ్లీకి దూరంగా ఉండటం వల్ల రాజకీయంగా లాభమా నష్టమా అన్నది కాలమే తేల్చనుంది. ప్రజా సమస్యలపై పోరాటానికి సభా వేదికను ఎంచుకుంటుందా, లేక బయట నుంచే ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తుందా అనేది రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

**వైసీపీ రికార్డు**

చట్ట సభలే ప్రజాస్వామ్య వేదికలు. అక్కడ అన్ని పక్షాలు కలిసి ప్రజా సమస్యల మీద చర్చిస్తాయి. అలాంటి వేదికలను బహిష్కరించడం అన్నది తొలి తరంలో జరిగేది కాదు, అసలు వాకౌట్లు కూడా అప్పట్లో తక్కువగా ఉండేవి. అయితే రాను రానూ రాజకీయం పెరిగి సభలకే దుమ్మా కొడుతున్నారు. ఇక దేశంలో శాసనసభ మొత్తాన్ని లేదా సమావేశాలను ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పూర్తిగా బహిష్కరించడం అనేది ఎక్కడా లేదని అంటున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్రాల వారీగా అక్కడి రాజకీయ పరిస్థితులు అధికార ప్రతిపక్షాల మధ్య వివాదాలు లేదా సభలో తమకు సముచిత గౌరవం దక్కలేదనే కారణాలపై ఈ బహిష్కరణలు ఆధారపడి ఉంటాయి. మరో వైపు చూస్తే భారతదేశంలో అసెంబ్లీలను బహిష్కరించే పార్టీలు ఉన్నా పాక్షికంగా పరిమితంగా జరిగిన సందర్భాలు ఉన్నాయని అంటున్నారు. కొన్ని సందర్భాలలో ప్రతిపక్ష పార్టీలు నిరసనగా సభలకు దూరంగా ఉంటూ వచ్చిన నేపథ్యం ఉంది. అయితే ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీ మొత్తం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతారాహిత్యంగా అధికార పార్టీలు విమర్శిస్తుంటాయి. సభలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, బహిష్కరణలు సరైనవి కాదని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతుంటారు. ఏపీలో చూస్తే మూడు సందర్భాలలో ముగ్గురు నాయకులు అసెంబ్లీ బహిష్కరణ పిలుపు ఇచ్చారు. వారే ఎన్టీఆర్, జగన్ చంద్రబాబుగా చెప్పాలి మూడున్నర దశాబ్దాల క్రితం చూస్తే ఎన్టీఆర్ 1989లో విపక్షంలో ఉన్నారు. అయితే ఆయన పార్టీకి చెందిన వారు అంతా సభకు హాజరయ్యారు. అప్పట్లో ఉప నాయకులుగా చంద్రబాబు ఇతర నేతలు కలసి టీడీపీని అసెంబ్లీలో నడిపించారు. ఇక జగన్ అయితే 2017లో అసెంబ్లీకి రావడం లేదని ఒక దండం పెట్టి మరీ జనంలోకి పాదయాత్ర కోసం వెళ్లారు. అయితే జగన్ అప్పటికి మూడేళ్ళ పాటు అసెంబ్లీకి హాజరయ్యేవారు. చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయన 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో సభలో తనకు అవమానం జరిగిందంటూ చంద్రబాబు అసెంబ్లీని బహిష్కరించి మళ్లీ అధికారంలోకి వస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి వెలువడిన సందర్భాన్ని రాజకీయ ప్రత్యర్థులు ప్రస్తావిస్తుంటారు ఇక అసెంబ్లీలను బహిష్కరించడం అన్న దానికి బీజం తమిళనాడులో జయలలిత హయాంలో పడింది అని చెప్పాల్సి ఉంటుంది. 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘోర అవమానం కారణంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలిత సభను బహిష్కరించారు. డీఎంకే సభ్యుల దాడిలో అవమానానికి గురైన ఆమెమళ్ళీ ముఖ్యమంత్రిగా అడుగుపెడతాను అని భీష్మ ప్రతిజ్ఞ చేసి సభను వీడారు. ఈ సంఘటన ఆమె రాజకీయ జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ప్రజల్లో ఆమెకు సానుభూతి పెరిగింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత 1991 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, తాను అనుకున్నట్టుగానే తమిళనాడు తొలి మహిళా పూర్తికాల ముఖ్యమంత్రిగా ఘనంగా అసెంబ్లీలో అడుగుపెట్టారు అయితే వైసీపీ మాత్రం 2024లో కొత్త అసెంబ్లీ ఏర్పాటు అయ్యాక అసెంబ్లీకి వెళ్ళడం మానుకుంది. ఆ పార్టీ తనకు 11 సీట్లు వచ్చినా ప్రధాన ప్రతిపక్ష పాత్ర కోరుతోంది. అయితే రూల్స్ మాత్రం అందుకు ఒప్పుకోవని స్పీకర్ ఆఫీసు చెబుతోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీకి వైసీపీ దూరంగా ఉంటోంది. ఇప్పటికి 26 నెలలు గడచిపోయినా వైసీపీ అసెంబ్లీ వైపు చూడడం లేదు, దీని మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీని ప్రతిపక్షాలు బహిష్కరించడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలపై సభలోనే తేల్చుకోవాలని ఆయన అన్నారు. వైసీపీ తీరును తప్పుపడుతూ తన రాజకీయ జీవితం మొత్తంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. దేశంలో కూడా ఈ రకమైన పరిణామాలు ఎక్కడైనా జరిగాయో లేవో కానీ ఈ విషయంలో వైసీపీది కొత్త రికార్డు అని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు.

# 22 ఏ శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

# చిక్కుముడులు పరిష్కారం అయ్యేనా

హైదరాబాద్, ఆగస్టు 21 తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్న 22ం నిషేధిత భూముల వివాదానికి శాశ్వత ముగింపు పలికేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. నిషేధిత భూముల వివాదం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారి తీసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శల దాడి తీవ్రం చేశాయి. బీఆర్ఎస్ సీనియ్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి భారీ సెటిల్మెంట్‌లు, 30 శాతం కమీషన్లు, వసూలు చేయడానికే ఉద్దేశపూర్వకంగా ఈ ప్రైవేటు భూములను 22ం జాబితాలోకి నెట్టేసి కృత్రిమ సమస్యలను సృష్టించారని ఆరోపించారు. దీనికి బాధ్యత వహించి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో జోక్యం చేసుకున్న పెద్దలు ఎవరో తేల్చాలని అన్నారు. మరోవైపు బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి కూడా ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన భూలావాదేవీలు, నిషేధిత భూముల జాబితా మార్పుల వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, దీనిపై తక్షణమే సమగ్ర శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తన వద్ద ఉన్న పక్కా ఆధారాలతో తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ఎటు చూసినా లక్షలాది మంది సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ భూవివాదాన్ని పరిష్కరించడం ద్వారా అటు ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు, ఇటు విపక్షాల విమర్శల దాడికి కూడా అడ్డుకట్ట వేయాలని రేవంత్ రెడ్డి సర్కారు యోచిస్తోంది. 2025 డిసెంబర్‌లో రూపొందించిన నూతన నిషేధిత జాబితాపై సర్వత్రా అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేథ్యంలో, ఆ వివాదాస్పద కొత్త జాబితాను పూర్తిగా పక్కన పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ తలనొప్పుల నుంచి బయటపడటానికి 2023 డిసెంబర్ కంటే ముందు అమలులో ఉన్న పాత నిషేధిత జాబితాకే పరిమితం కావడం అత్యుత్తమ మార్గమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ఉన్నతాధికారులు గట్టిగా యోచిస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలు, క్రమబద్దీకరణ జీవోలను సైతం బేఖాతరు చేస్తూ రెవెన్యూ యంత్రాంగం తయారు చేసిన కొత్త జాబితా వల్ల లక్షలాది మంది సామాన్య కొనుగోలుదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులపాలవుతన్నారని తేలడంతో సర్కారు ఈ దిశగా కసరత్తు వేగవంతం చేసింది. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతాధికారులతో నిర్వహించిన అత్యవసర టెలికాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పక్కా ఆధారాలు ఉన్న భూములకు వెంటనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. నిషేధిత జాబితా అనేది దేవాదాయ, వక్ఫ్ ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సీలింగ్ భూములు, కోర్టు అటాచ్మెంట్లు, పన్ను ఎగవేతల కింద ఉన్న స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ఉద్దేశించిన రక్షణ కవచం. 2007వ సంవత్సరం వరకు ఈ నిషేధిత భూములు అనే అంశంపై పెద్దగా చర్చలు జరిగేవి కావు. అప్పట్లో కేవలం 13. 82 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు, 7.21లక్షల ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాలు, 41. 74 లక్షల ఎకరాల అటవీ భూములు, దేవాదాయ శాఖ పరిధిలోని 74, 128 ఎకరాలు, వక్ఫ్ బోర్డుకు చెందిన 45, 564 ఎకరాలు మాత్రమే ఈ జాబితాలో ఉండేవి. కానీ కాలక్రమేణా పరిధి అడ్డూఅదుపూ లేకుండా విస్తరిస్తూ పోయింది. 2007 నుంచి 2017 మధ్య కాలంలో రాష్ట్రంలో ఉన్న మొత్తం భూముల్లో సుమారు 10 శాతం మాత్రమే 22 ఏ కింద ఉండగా, నేడు అది ఏకంగా 30 నుంచి 40 శాతానికి చేరిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 2025 డిసెంబరులో అనాలోచితంగా రూపొందించిన కొత్త జాబితాలో దశాబ్దాలుగా రైతుల సాగులో ఉన్న వ్యవసాయ భూములు, ఔటర్ రింగ్ రోడ్డు లోపల నిర్మించిన బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, సామాన్యులు కొనుగోలు చేసిన ఓపెన్ ప్లాట్లను కూడా నిషేధిత జాబితాలోకి నెట్టేయడం పెను దుమారానికి దారి తీసింది. కొత్తగా చేర్చిన ప్రైవేటు ఆస్తుల వల్ల రిజిస్ట్రేషన్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయి రియల్ ఎస్టేట్ రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న అభ్యంతరాల వల్ల ఈ వారంలోనే వివాదాస్పద కొత్త జాబితాను రద్దు చేసి, 2023 డిసెంబర్ నాటి పాత జాబితా ప్రాతిపదికన మాత్రమే లావాదేవీలు జరపాలని ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. పాత రికార్డుల ప్రకారమే ముందుకు వెళ్లడం వల్ల ప్రస్తుతం తలెత్తిన అనేక వివాదాలు తక్షణమే సమసిపోతాయని అధికారులు గట్టిగా నమ్ముతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు స్వయంగా చొరవ తీసుకుని బాధితులకు ఫోన్‌ల ద్వారా సమాచారం అందిస్తూ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేస్తున్నారు. బాలానగర్ పరిధిలోని సర్వే నంబర్‌లో 101/1, 102/2, 102, 108, 109, 112, 81లలో సుమారు 3 వేల చదరపు మీటర్ల స్థలంపై ఉన్న 22ం నిషేధాన్ని అధికారులు అధికారికంగా తొలగించారు. ఈ సర్వే నంబర్లు పరిధిలోని భూ యజమానులు ఇప్పుడు ఎలాంటి అడ్డంకులు లేకుండా తమ ఆస్తుల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సబ్‌రిజిస్ట్రార్ ప్రకటించారు. పోచారం గ్రామంలోని సర్వే నెంబర్ 50లో ఉన్న స్థలాన్ని గత డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు భూమిగా చూపిస్తూ పొరపాటున 22ం నిషేధిత జాబితాలో చేర్చారు. దీని వల్ల అక్కడి కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన క్లియరెన్స్ రావడంతో అక్కడ తిరిగి రిజిస్ట్రేషన్లు ప్రక్రియ ప్రారంభించారు. కూకట్‌పల్లి పరిధిలోని అడ్డగుట్ట సొసైటీలో ఉన్న సుమారు 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి ప్రభుత్వం విజయవంతంగా తొలగించింది. ఈ సొసైటీకి చెందిన లబ్ధిదారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను సంస్కరించడానికి ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో అసలు ఏ కేటగిరి కింద ఎంత భూమి 22ం పరిధిలో ఉందో సమగ్ర నివేదిక ఇవ్వాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్‌ను ధరణి కమిటీ కోరింది. అయితే సీసీఎల్ఏ నుంచి ధరణి కమిటీకి ఎలాంటి స్పష్టమైన నివేదికలు అందలేదు. నిషేధిత జాబితా రూపకల్పనలో ఎంతటి గందరగోళం, లోపాలు ఉన్నాయో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది.

# నాసిక్, సూరత్ తర్వాత రంగారెడ్డి..

హైదరాబాద్, ఆగస్టు 21 ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్న ప్రాంతాల్లో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చోటు దక్కింది. జైపూర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్‌తో పాటు రంగారెడ్డి తన ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నట్లు 'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్' తాజా నివేదిక వెల్లడించింది. దేశ ఆర్థిక వృద్ధి ఇక సంప్రదాయ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోందని తెలిపింది. 'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ సిటీ వైటాలిటీ ఇండెక్స్' ప్రకారం దేశంలో అత్యంత ఆర్థికంగా కీలకమైన మెట్రో నగరంగా పుణె నిలిచింది. ఐటీ సేవలు, అధునాతన తయారీ, ఆటోమొబైల్, విద్య, ఆవిష్కరణ ఆధారిత కార్యకలాపాలు పుణెకు కలిసొచ్చాయి. అహ్మదాబాద్ రెండో స్థానంలో నిలిచింది. మెట్రో నగరాల్లో ఆర్థిక వృద్ధి వేగం విషయంలో కోల్‌కతా ముందుంది. ఏప్రిల్-జూన్ 2026 కాలానికి రూపొందించిన సూచీలో దేశవ్యాప్తంగా 800కుపైగా జిల్లాలను పరిశీలించారు. ఉపగ్రహ ఆధారిత భౌగోళిక పరిశీలన డేటాతో పాటు ఆర్థిక సూచీలను ఇందుకు ఉపయోగించారు. అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో సౌత్ 24 పరగణాస్ అగ్రస్థానంలో నిలిచింది. నార్త్ 24 పరగణాస్, థానే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జైపుర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్, రంగారెడ్డి ప్రాంతాలు కూడా తమ ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. గత దశాబ్దంలో దిమాపూర్, పంచమహల్స్, ఆనంద్, అయోధ్య, రాంపుర్, బస్తీ, షామ్లి, బౌధ్, ఔరంగాబాద్, కోడెర్మా వంటి జిల్లాలు స్థిరమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేశాయి. దేశంలో పట్టణీకరణ మరింత విస్తృతంగా జరుగుతోందని నివేదిక పేర్కొంది. పెట్టుబడులు, వ్యాపారాలు, ప్రతిభావంతులైన మానవ వనరులు, మౌలిక వసతులు కొత్త నగరాల వైపు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపింది. భవిష్యత్ పెట్టుబడులకు ఈ కొత్త వృద్ధి మార్గాలు కీలకంగా మారనున్నాయని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ అభిప్రాయపడింది.

# డిజిటల్ కరెన్సీతో పాటు...

# ఫిజికల్ కరెన్సీకి తగ్గని డిమాండ్

ముంబై ఆగస్టు 21, (న్యూస్ పల్స్) దేశంలో డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్నప్పటికీ.. నగదుపై ఆధారపడటం మాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్లకు భారీగా డిమాండ్ కొనసాగుతోంది. ఫలితంగా దేశంలో చలామణీలో ఉన్న కరెన్సీ నోట్ల సంఖ్య ఏకంగా 17,600 కోట్లకు చేరుకుంది. భారత కరెన్సీలో తక్కువ విలువ కలిగిన ?1, ?5, ?10, ?20, ?50, ?100, ?200, ?500 నోట్లు పెద్ద మొత్తంలో చలామణిలో ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్ శిరీష్ చంద్ర ముర్ము వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం దేశంలో సుమారు 17,600 కోట్ల కరెన్సీ నోట్లు ప్రజల వినియోగంలో ఉన్నాయి. అయితే, ఇది ప్రపంచ వ్యాప్తంగా చెలామణిలో ఉన్న డాలర్ నోట్లు 5600 కోట్ల కంటే ఇవి 3 రెట్లు, యూరో నోట్లు 3000 కోట్లు కంటే 6 రెట్లు అధికం కావడం గమనార్హం. జకార్తాలో జరిగిన బ్యాంక్ ఆఫ్ ఇండోనేషియా క్యాష్ మేనేజ్‌మెంట్ సదస్సులో ఈ వివరాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే భారతదేశంలో చలామణిలో ఉన్న నోట్ల సంఖ్య గణనీయంగా ఎక్కువగా ఉండటం ఆసక్తికరంగా మారింది. భారత్‌లో నగదు లావాదేవీల్లో తక్కువ విలువ కలిగిన నోట్ల వినియోగం అధికంగా ఉండటంతో.. వాటి అవసరం కూడా ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా పాత నోట్లు పాడైపోవడం, వినియోగానికి పనికిరాకపోవడం వంటి కారణాలతో వాటి స్థానంలో కొత్త నోట్లను ముద్రించాల్సి వస్తోంది. గణాంకాల ప్రకారం దేశంలో ఏటా దాదాపు 3,000 కోట్ల వరకు కొత్త కరెన్సీ నోట్లు ముద్రిస్తున్నారు. అదే సమయంలో పాడైన, చిరిగిన లేదా వినియోగానికి పనికిరాని సుమారు 2,100 కోట్ల నోట్లను ఏటా ఉపసంహరించి ధ్వంసం చేస్తున్నారు., ఇంటర్నెట్ బ్యాంకింగ్, కార్డులు వంటి డిజిటల్ చెల్లింపు విధానాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ.. దేశంలో నగదు వినియోగం పూర్తిగా తగ్గలేదు. ముఖ్యంగా చిన్న మొత్తాల లావాదేవీలు, గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాల్లో నగదు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్న సమయంలోనే నగదు చెలామణి కూడా వృద్ధి చెందడం భారత ఆర్థిక వ్యవస్థలో నగదుకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తోంది. దీంతో ఒకవైపు డిజిటల్ ఎకానమీ విస్తరిస్తుండగా.. మరోవైపు కరెన్సీ నోట్ల అవసరం కూడా కొనసాగుతోంది. నోట్ల ముద్రణ, పాత నోట్ల ఉపసంహరణ, వాటి స్థానంలో కొత్త నోట్లను ప్రవేశపెట్టడం వంటి ప్రక్రియలకు భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలు, నిర్వహణ అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో కరెన్సీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం, నోట్ల జీవితకాలాన్ని పెంచడం వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. డిజిటల్ చెల్లింపుల విస్తరణ కొనసాగుతున్నప్పటికీ.. దేశ ఆర్థిక వ్యవస్థలో నగదు పాత్ర ఇప్పటికీ కీలకంగానే ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి

## కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో 18 వా కరాటే కాంపిటేషన్

హైదరాబాద్ యూసఫ్ గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన 18 వా కాంపిటేషన్ నిర్వహించారు. దాదాపు 500 మంది కరాటే జపాన్ కరెట్టే కి సంబంధించిన మాస్టర్లతో పాటు యువకులు యువతులు పాల్గొన్నారు. జపాన్ నుంచి వచ్చిన ముఖ్యఅతిథి తనయమ షిశాన్ హాకీ జూమ్ రాసిన షిశాన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ప్రతి ఒక్క యువకుడికి ఆత్మ రక్షణ కోసం కరటే నేర్చుకోవాల్సిందే అని జపాన్ కి సంబంధించిన మాస్టర్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలకి యువతులకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుని ఎక్కడ ఎలాంటి సంఘటన తన పైకి వచ్చినప్పుడు ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలని జపాన్ కరాటే అసోసియేషన్ వారు గత 18 సంవత్సరాల నుండి తెలంగాణ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. యువకులని ప్రోత్సహించడానికి కాంపిటేషన్లు కూడా నిర్వహిస్తున్నారా అన్నారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ప్రాక్టీస్ నిర్వహించిన తర్వాత రెండో రోజు నుంచి టోర్నమెంట్ ప్రారంభం కానున్నది ఈ టోర్నమెంట్లో దేశవ్యాప్తంగా కరాటే కాంపిటీషన్లో యువకులు యువకులు పాల్గొన్నారు. మూడోరోజు కార్యక్రమం ఫైనల్ కాంపిటేషన్ తర్వాత విజేతలకు ట్రోఫీలు అందజేయనున్నారు. ఇలాంటి కార్యక్రమాలను జపాన్ కరాటే అసోసియేషన్ వారు నిర్వహించడం చాలా సంతోషకరమని జపాన్ నుంచి వచ్చిన మాస్టర్లు తెలిపారు.

# కాంగ్రెస్ లో పాత రోజులు

హైదరాబాద్, ఆగస్టు 21 కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని చెప్పుకుంటూ ఉంటారు. అసంతృప్తి ప్రకటనలు చేసే వారికి ఈ పేరు పెట్టుకున్నారు. ఇప్పుడీ కాంగ్రెస్ మార్క్ అంతర్గత ప్రజాస్వామ్యం హద్దులు దాటి పోతోంది. రాజగోపాల్ రెడ్డి నిరంతరం వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. అనిరుధ్ రెడ్డితో పాటు ఇటీవల చిన్నారెడ్డి కూడా అదే చేశారు. తాజాగా సుస్మితా పటేల్ సంచలనం సృష్టించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర రాజకీయ కలకలాన్ని రేపాయి. సీఎం రేవంత్‌కు పార్టీ సిద్ధాంతాలు ఇంకా వంటబట్టలేదని, కాంగ్రెస్ క్రమంగా టీడీపీ కాంగ్రెస్ గా మారుతోందని ఆరోపిస్తూ ఆమె నేరుగా తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన ఒక కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ టికెట్ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మాకు టికెట్ నిరాకరించడానికి అసలు రేవంత్ రెడ్డి ఎవరు? టికెట్ల కేటాయింపు అధిష్ఠానం పరిధిలోని అంశం అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను స్వతంత్రంగానైనా పోటీ చేసి గెలిచి తీరుతానని సవాల్ విసిరారు. అనాడు రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు కావాలని మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేస్తూ, కొడంగల్ లో ఓడిపోయిన విషయాన్ని సీఎం మరిచి పోవద్దంటూ అత్యంత ఘాటైన స్వరంతో విమర్శలు గుప్పించారు.ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ స్థాయికి చేరిందో స్పష్టంచేస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలు ఇదివరకే వేర్వేరు సందర్భాల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కగా, ఇప్పుడు కొండా సురేఖ కుటుంబం నేరుగా సీఎంపైనే విమర్శల బాణాలు విసరడం శాసనసభా పక్షంలో సంచలనంగా మారింది. పార్టీలోని పాత కాంగ్రెస్ నేతలు, బీసీ నాయకులను పక్కనబెట్టి, వలస నేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఈ వరుస తిరుగుబాట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.మరోవైపు పీసీసీ క్రమశిక్షణ కమిటీ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిస్సహాయంగా మారిపోయారు. బహిరంగంగా పార్టీ సిద్ధాంతాలను, ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం పార్టీలో క్రమశిక్షణ రాహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని ఎంపీ మల్లు రవి వంటి నేతలు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసమ్మతి నేతలను అదుపు చేయడంలో గాంధీ భవన్ నాయకత్వం పూర్తిగా వెనకబడి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనాపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నప్పటికీ, సొంత కేబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్రమైన విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ ఘర్షణ వాతావరణం, ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకుని పార్టీలోని అంతర్గత పోరుకు చెక్ పెట్టకపోతే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మరియు క్రెడిబిలిటీకి పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.

రేవంత్ ఫెయిలవుతున్నారా

తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పుడు పరిపాలన కంటే పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే పెను సవాలుగా మారుతున్నాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శించిన నాయకత్వం.. సొంత పార్టీలోని సీనియర్లు, వలస నేతల అసంతృప్తిని దారికి తేవడంలో మాత్రం తడబడుతోందనే వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధిష్ఠానాన్ని నేరుగా టార్గెట్ చేయకుండా, కేవలం సీఎం రేవంత్‌ను మాత్రమే కేంద్రబిందువుగా చేసుకుని నేతలు సాగిస్తున్న స్వరం రోజురోజుకూ శృతిమించుతోంది.ఎన్నికల సమయంలో తన అనుకూల వర్గానికి టికెట్లు ఇప్పించుకుని, వారిని గెలిపించుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచీ రేవంత్‌పై ఉన్నాయి. ఆ సమయంలో అధికారమే లక్ష్యంగా అంతా సర్దుకుపోయినా, ప్రభుత్వం ఏర్పడ్డాక సీనియర్లను విస్మరిస్తున్నారనే భావన పాత కాంగ్రెస్ నేతల్లో అసహనాన్ని పెంచింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడం, నామినేటెడ్ పదవుల జాప్యం, పార్టీలో ప్రాధాన్యం తగ్గడం వంటి అంశాలు అంతర్గత అసంతృప్తిని రాజేస్తున్నాయి.కేబినెట్ పదవి ఆశించి భంగపడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొదటి ఏడాది నుంచే సీఎంను లక్ష్యంగా చేసుకుని గళమెత్తుతున్నారు. సీఎం మార్పు ప్రస్తావన తెస్తూ, ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నామనే సంకేతాలు ఇవ్వడం ప్రభుత్వ స్థిరత్వంపై చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్లు నిధుల కొరత, నిర్లక్ష్యంపై బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. దానం నాగేందర్ లాంటి నేతలు గత పాలనను ప్రస్తావిస్తూ ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేత చిన్నారెడ్డి టికెట్ల కేటాయింపు వ్యవహారాలపై విమర్శలు గుప్పించగా, పార్టీ వీడిన జీవన్ రెడ్డి తరచూ సీఎం శైలిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. విజయశాంతి ప్రభుత్వ విధానాలపై పెదవి విప్పగా, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ఏకంగా పరకాల టికెట్ కేటాయింపు, కుటుంబానికి ఎమ్మెల్సీ నిరాకరణ వంటి అంశాలపై సీఎం కుటుంబ సభ్యులను సైతం టార్గెట్ చేస్తూ స్వతంత్ర పోరుకు సిద్ధమవడం ప్రకంపనలు సృష్టిస్తోంది.అసమ్మతి స్వరాలు పెల్లుబుకుతున్నప్పుడు వాటిని బుజ్జగించడం లేదా సమన్వయ కమిటీల ద్వారా పరిష్కరించడంలో అధిష్ఠానం, సీఎం స్థాయి సంప్రదింపులు కొరవడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపు ప్రతిపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలను రాజకీయంగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు.. సొంత పార్టీ నేతల అసంతృప్తి వ్యాఖ్యలే ప్రతిపక్షాలకు ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. కేటీఆర్, హరీశ్ రావు వంటి విపక్ష నాయకులు కాంగ్రెస్ అసమ్మతి నేతల వ్యాఖ్యలనే కోట్ చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు.ముఖ్యమంత్రిగా పరిపాలనపై పట్టు సాధిస్తున్నప్పటికీ, సొంత గూటిలోని అసమ్మతిని ఒకే తాటిపైకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్నది స్పష్టమవుతోంది. తక్షణమే సమన్వయ యంత్రాంగాన్ని బలోపేతం చేసి, అంతర్గత కుమ్ములాటలకు తెరదించకపోతే.. ఈ అంతర్గత అసంతృప్తే ప్రభుత్వ ఉనికికి రాజకీయంగా గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉంది.

# కాంగ్రెస్‌లో కష్టమే.. వేరే పార్టీలు చేర్చుకోవు!

వరంగల్, ఆగస్టు 21 వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మొదటినుంచీ దూకుడు వైఖరి ప్రదర్శించే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి కుటుంబం.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపైనే నేరుగా బహిరంగ తిరుగుబాటు బావుటా ఎగురవేయడం తెలంగాణ కాంగ్రెస్‌లో పెను దుమారానికి దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం పిలుపునిచ్చిన వెంటనే.. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ సీఎం రేవంత్‌పై తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. తల్లిదండ్రుల ప్రత్యక్ష ఆశీస్సులు, సంపూర్ణ రాజకీయ మద్దతు లేకుండా కేవలం ఒక కుమార్తెగా ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇంతటి తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేయడం అసాధ్యమని, ఇది పూర్తిగా కొండా దంపతుల వ్యూహాత్మక రాజకీయమే.ఈ దూకుడు వెనుక ఉన్న ప్రధాన కారణం పరకాల నియోజకవర్గంలో తమ పట్టును, వచ్చే తరం రాజకీయ వారసత్వాన్ని కాపాడుకునే తాపత్రయమే. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపిస్తూనే, తమ కుమార్తె సుస్మితను పరకాల నుంచి బరిలోకి దింపాలన్న పట్టుదలతో కొండా కుటుంబం ఉంది. అయితే రేవంత్ రెడ్డి మాత్రం రేవూరి ప్రకాష్ రెడ్డికి పరోక్షంగా మద్దతు ప్రకటించడంతో కొండా వర్గంలో అభద్రతాభావం తారాస్థాయికి చేరింది. అధిష్ఠానాన్ని, సీఎంను తీవ్రస్థాయిలో బెదిరించి, ఒత్తిడి తీసుకురావడం ద్వారానే తమ రాజకీయ డిమాండ్లను సాధించుకోవచ్చనే పాత పంథానే వారు మళ్లీ నమ్ముకున్నట్లు కనిపిస్తోంది. అయితే ఈ తరహా దూకుడు రాజకీయాలు కొండా కుటుంబ రాజకీయ భవిష్యత్‌కు చేటు తెచ్చే ప్రమాదం ఉంది. గతంలో వైఎస్సార్ మరణానంతరం వైఎస్సార్‌సీపీలోకి వెళ్లడం, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి అనుభవించి అక్కడా కేసీఆర్‌పై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌కు రావడం వంటి వరుస పార్టీ మార్పిడుల చరిత్ర వారికి ఉంది. క్రమశిక్షణారాహిత్యంతో సొంత ప్రభుత్వాలపైనే రచ్చకెక్కే నైజం ఉన్న నేతలను చేర్చుకోవడానికి విపక్ష బీఆర్ఎస్ లేదా బీజేపీ వంటి ఇతర పార్టీలు కూడా సుముఖంగా ఉండే అవకాశం లేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే లేదా కేబినెట్ నుంచి తప్పిస్తే.. రాజకీయంగా ఒంటరిపాటు కావడం ఖాయమనే వాదన బలంగా వినిపిస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో కొండా కుటుంబం తీసుకుంటున్నది అత్యంత ప్రమాదకరమైన జూదమని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఉంటూనే సీఎం స్థాయి వ్యక్తిపై బరితెగించి ఆరోపణలు చేయడం వల్ల తాత్కాలికంగా మీడియా మైలేజ్ లభించినప్పటికీ, దీర్ఘకాలికంగా అది వారి రాజకీయ పునాదులకే గొడ్డలిపెట్టుగా మారే అవకాశం ఉంది.

కొండా సురేఖ భవిష్యత్తు తేల్చేది ఆ లేఖేనా

సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో మంత్రి కొండా సురేఖ స్వయంగా కల్పించుకుని, కూతురి వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సీఎంకు క్షమాపణలు చెప్పి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అయితే, ఒకసారి పొరపాటు జరిగిందని సరిదిద్దుకున్న తర్వాత కూడా మళ్లీ అదే తరహాలో ముఖ్యమంత్రిపై బహిరంగ విమర్శలు చేయడం వెనుక గల ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరిగా కేవలం ఒక క్షమాపణ లేఖతో ఈ వివాదం సద్దుమణుగుతుందా? లేక అధిష్ఠానం కఠిన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తుందా? అన్నది పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.క్రమశిక్షణ కమిటీకి సమర్పించే లేఖలో కొండా సురేఖ ఏ వైఖరి తీసుకుంటారనే అంశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆమె ముందు ప్రధానంగా మూడు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకటి కూతురి వ్యాఖ్యలకు మద్దతు తెలపడం. కూతురు లేవనెత్తిన అంశాలను సమర్థిస్తే అది నేరుగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినట్లే అవుతుంది. ఇది మంత్రి పదవికే ముప్పు తెచ్చే ప్రమాదం ఉంది. రెండోది కూతురి వ్యాఖ్యలను ఖండించి క్షమాపణ కోరడం. కూతురి వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని తేల్చిచెప్పడం. తద్వారా అధిష్ఠానం ఆగ్రహం నుంచి తప్పించుకోవడం. మూడోది పరకాల రాజకీయాన్ని తెరపైకి తేవడం. కూతురి వ్యాఖ్యలపై పెద్దగా స్పందించకుండా, స్థానిక రాజకీయం, పరకాల నియోజకవర్గంలో తమ వర్గానికి జరుగుతున్న అన్యాయం, గ్రూపు రాజకీయాల వల్లే అసహనంతో ఆ వ్యాఖ్యలు వచ్చాయనే విషయాన్ని లేఖలో ప్రస్తావించడం.కొండా కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, బలమైన క్యాడర్ ఉన్నాయి. అయితే, ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో నేరుగా తలపడటం కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. క్రమశిక్షణ కమిటీకి ఇచ్చే వివరణ అసంతృప్తికరంగా ఉంటే అధిష్ఠానం ఎలాంటి కఠిన నిర్ణయానికైనా వెనుకాడకపోవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖ పంపే లేఖ ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా, లేక కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయ సంక్షోభానికి నాంది పలుకుతుందా అనేది కొద్ది గంటల్లో తేలనుంది.

# కొండా సురేఖ పై మండపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్ మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యాలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మండిపడుతున్నారు. బహిష్కరించకముందే ముందే పార్టీ నుండి వెళ్లిపోండి అని కొండా సురేఖ ను ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మా పార్టీలోనే కొన్ని గుంట నక్కలు కొండా సురేఖ వెనకాల ఉన్నాయి. అమ్మా సురేఖ.. రేవంత్ రెడ్డి రక్తం తాగింది చాలు పార్టీ నుండి వెళ్ళిపోండి. కొండా సురేఖను పార్టీలో నుండి బహిష్కరించక ముందే ఆమెనే వెళ్లిపోతే మంచిది. మాలాంటి వాళ్లని అవమానపరుస్తూ మా రక్తం తాగుతామంటే మేము చూస్తూ సహించమని అన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ అందరం అండగా వున్నామని అన్నారు. నటి సమంత విషయం లో కూడా సురేఖ ఇలాగే మాట్లాడరని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పై ఎవరు విమర్శలు చేసిన చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రేవంత్ నిర్ణయాలను వ్యతిరేకిస్తే పార్టీలో ఉండే అర్హత లేదని అన్నారు. కొండా సురేఖకు నోటీసులు ఇస్తే తన బిడ్డ వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని చెబుతున్నారని, సంబంధం లేకపోతే ఆ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. తప్పుడు భాషతో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం మూల్యం చెల్లిస్తున్నారని విమర్శించారు.

# తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది

హైదరాబాద్, ఆగస్టు 21 తెలంగాణలో 2023 ఎన్నికల్లో ఎనిమిది శాసనసభ స్థానాలను గెలుచుకుని, ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది లోక్ సభ స్థానాలను గెలుచుకుని సత్తాచాటిన భారతీయ జనతా పార్టీ ఇటీవలి కాలంలో చతికిల పడినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నాలుగు ఎంపీ స్థానాల నుండి గత లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది లోక్ సభ స్థానాలు అంటే 56 శాసనసభ స్థానాలలో ప్రభావం చూపించి గెలిచిన పార్టీ ఆ తర్వాత ఆ స్థాయిలో పుంజుకోక పోవడానికి కారణం ఏంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రూప్-1పై మాజీ సీఎం జగన్ సంచలన నిర్ణయం గతంలో బీజేపీ నేతలు, ప్రస్తుత బీజేపీ ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావులు తీవ్ర విమర్శలతో ప్రభుత్వం మీద విరుచుకుపడేవారు. కానీ ఇటీవల కాలంలో వారు పూర్తిగా సైలెంట్ అయిపోయారు. అంతర్గత కలహాలతో పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇక పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంటున్నారు. బండి సంజయ్ కుమారుడి మీద ఆరోపణలతో పాటు రఘునందన్ రావు అసైన్డ్ భూముల కొనుగోలు వ్యవహారం కూడా చర్చనీయాంశం అయింది.ఇది ఇలా ఉంటే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులతో అపాయింట్ మెంట్ ఇప్పించాలని, మహారాష్ట్ర సీఎంతో అపాయింట్ మెంట్ ఇప్పించి, ఆ ప్రభుత్వాన్ని తుమ్మిడిహెట్టి వద్ద 152 అడుగుల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించాలని రేవంత్ రెడ్డి పలుమార్లు డిమాండ్ చేయడం జరిగింది. కానీ ఆయన డిమాండ్లను సరైన రీతిలో తిప్పికొట్టకపోగా, దగ్గరుండి కేంద్ర మంత్రులను కల్పించి, హైదరాబాద్ మెట్రోకు నిధులు సమకూర్చే విషయమై మంతనాలు జరిపారు. కానీ ఇప్పటి వరకు నిధులు రాకపోగా, రోజుకు రెండు కోట్లు అదనంగా తెలంగాణ ఖజానా మీద భారం పడుతున్నది. మెట్రో రైలు స్వాధీనం విషయంలో రేవంత్ రెడ్డి వైఖరిని ఎండగట్టకుండా వదిలేయడం మూలంగానే మెట్రో విషయంలో తను చేసిన తప్పును కేంద్ర ప్రభుత్వం మీదకు నెట్టే ప్రయత్నం జరుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.షహజాద్ భట్టీ సంచలన వ్యాఖ్యలు ఈ పరిణామాలు ఇలా ఉంటే ఉత్తర తెలంగాణాలోని ఒక ఎంపీ బీజేపీ నుండి కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు పావులు కదుపుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తెలంగాణ బీజేపీ పనితీరు మీద అసహనంతో ఉన్న ఆ ఎంపీ ఇటీవల ఒక ఏఐసీసీ నేతతో టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తుంది. రెండో సారి ఎంపీ అయినప్పటి నుండి కేంద్ర మంత్రి పదవి మీద కన్నేసిన సదరు ఎంపీ అది దక్కక పోవడంతో కనీసం రాష్ట్ర అధ్యక్ష పదవి అయినా వస్తుందని ఆశించారు. కానీ ఆ రెండూ దక్కక పోవడంతో కాంగ్రెస్ వైపు కన్నేసినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే ఆయన ఏఐసీసీ నేతకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలు, వాటి పర్యావసనాలు, మంత్రులు, ఎమ్మెల్యేల తీరు మీద నివేదికలు పంపుతున్నట్లు సమాచారం. ప్రతి సారీ ఈ సారి బీజేపీ అధికారంలోకి రావడం గ్యారంటీ అని భావిస్తుంటే, ఏదో ఒక కారణంతో పార్టీ గ్రాఫ్ పడిపోతుందని బీజేపీ కార్యకర్తలు వాపోతున్నారు. త్వరలోనే తెలంగాణలో అధికారం లక్ష్యంగా బీజేపీ అధిష్ఠానం చర్యలు చేపట్టబోతుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరి ఈ చిక్కుముళ్లను దాటుకుని ఎలా ముందుకు సాగుతారో వేచిచూడా

# శ్రీశైలంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రీశైలం రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా, శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. చంద్రావతి కల్యాణ మండపంలో వరలక్ష్మీ వ్రతాల్లో 1,500 మంది మహిళలు పాల్గొన్నారు. శ్రీశైలం దేవస్థానం అధికారులు, ప్రతి ఒక్కరికీ కలశాలు ఏర్పాటు చేసి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు చీర, రవికె, పూలు, గాజులు అందజేశారు.

# ఆరు చోట్ల ఈడీ సోదాలు

కడప మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి హైదరాబాద్, కడపలో మొత్తం ఆరు చోట్ల ఈడీ సోదాలు కొనసాగాయి. కడపలోని అవినాష్ రెడ్డి నివాసం సహ మరో మూడుచోట్ల ఈడీ సోదాలు జరిగాయి. సీబీఐ కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. కేసులో రాజకీయ నేతల ప్రమేయం, మనీలాండరింగ్ పై ఈడీ ఆరా తీస్తోంది. హత్యకు ముందు నగదు లావాదేవీల వ్యవహారం బయటకు రావడంతో దర్యాప్తు ప్రారంభమయింది. సీబీఐ దర్యాప్తు సమయంలో బయటకొచ్చిన అంశాలపై మరింత విచారణ జరుగుతోంది. నిందితులకు ఇచ్చిన రూ.4 కోట్లు ఎక్కణ్నుంచి, ఎలా వచ్చిందన్న అంశంపై దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ ఈడీ జోనల్ అధికారుల బృందాలు సోదాలు చేస్తున్నాయి.

## రెడ్మీ నోట్ 17 5జీ ఫోన్ లాంచ్ చేసిన సినీనటి హెబ్బా పటేల్

హైదరాబాద్ అమీర్ పేట వ్యాల్యూ జోన్ లోని సత్య మొబైల్స్లో నటి హెబ్బా పటేల్ సందడి చేశారు. సత్య మొబైల్స్ లో షావోమీ సబ్ బ్రాండ్ రెడ్మీ నోట్ 17 5జీ స్మార్ట్ మొబైల్ పే హెబ్బా పటేల్ సత్య ఏజెన్సీస్ ప్రతినిధి యూసుఫ్ తో కలిసి లాంచ్ చేశారు. ఈ సరి కొత్త మొబైల్లో కొంగొత్త ఫీచర్స్ తో వినియోగ దారులను ఆకట్టుకుంటుదన్నారు. ఈ సిరీస్లో దేశీయ మార్కెట్లోకి ప్రవేశించిన తొలి ఫోన్ ఇదే కావడం విశేషం. 8,000 ఎంఏ్హ భారీ బ్యాటరీ, 120ఊళి అమోలెడ్ డిస్ప్లే, స్నాప్డ్రాగన్ 4 జెన్ 4 ప్రాసెసర్ వంటి బలమైన ఫీచర్లతో తీసుకొచ్చిన ఈ స్మార్ట్ఫోన్ ప్రారంభ ధరను కంపెనీ రూ.27,999గా నిర్ణయించింది.

## హన్మకొండ జిల్లాలో కారులో డెడ్ బాడీ కలకలం

హన్మకొండ ఎల్కతుర్తి మండల కేంద్రంలో కారు (టూ 03 ఈఈ 8094) డిక్కీలో గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు గత రెండు రోజులుగా అక్కడే కారును వదిలేసి వెళ్లారు. కారు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించి విచారణ చేపట్టారు. కారు ఓనర్ సురేందర్ దగ్గర కొద్ది రోజుల క్రితం వినోద్ అనే సాఫ్ట్వేర్ ఉద్యోగి కారు అద్దెకు తీసుకున్నట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### ఎస్సీ బాలికల హాస్టల్లో శిశువు ఘటన

### హాస్టల్ విద్యార్థిగా నిర్ధారణ

తిరుపతి : శ్రీకాళహస్తి ఎస్సీ బాలికల హాస్టల్లో శిశువు ఘటనలో సస్పెన్స్ తొలగింది. శిశువుకు జన్మనిచ్చింది హాస్టల్ విద్యార్థినేనని పోలీసులు నిర్ధారించారు. నాలుగు రోజుల క్రితం హాస్టల్ మరుగుదొడ్ల దగ్గర శిశువు లభ్యం అయిన విషయం తెలిసిందే. విధుల్లో నిర్లక్ష్యం వహించిన హాస్టల్ వార్డెన్ జయసుధను అధికారులు సస్పెన్షన్ చేశారు. బాలిక గర్భం దాల్చి బిడ్డకు జన్మనివ్వడంపై పోక్సో కేసు నమోదు అయింది..

### ప్రియాంక కేసు నిందితులకు ముగిసిన కస్టడీ

రాజమండ్రి పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రియాంక కేసులో నిందితుల రెండు రోజుల కస్టడీ విచారణ పూర్తి అయింది. వైద్య పరీక్షల అనంతరం నిందితులను ప్రకాష్ నగర్ పోలీసులు రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు. మూడో తేదీన ప్రమాదం జరిగిన సమయం నుండి నిందితులు పారిపోయే వరకు ఏం చేశారనే కోణంలో పోలీసులు విచారణ చేశారు.

# తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



రాయచోటి తల్లిదండ్రులుమందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడిని రాయచోటి అర్బన్ పోలీసులు సకాలంలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గంగమ్మ ఆలయం సమీపంలోనివాసముంటున్న జయరాములు తన కుమారుడు లోకేష్‌ను మందలించడంతో బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు రాయచోటి అర్బన్ పోలీసులనుఆశ్రయించారు. అర్బన్ సీఐ వెంకట చలపతి ఆదేశాల మేరకు ఎస్ఐ చంద్రాయుడు సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ బాలుడి కదలికలను గుర్తించారు. చివరకు రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీలో బాలుడు ఉన్నట్లు గుర్తించి, ఎస్ఐ చంద్రాయుడు సమక్షంలో అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు తల్లిదండ్రులకు పిల్లలను మనసు గాయపడేలా మందలించకుండా, వారి సమస్యలను అర్థం చేసుకుని ప్రేమగా మాట్లాడాలని సూచించారు. బాలుడిని సకాలంలో గుర్తించడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని సీఐ వెంకట చలపతి అభినందించారు. బాలుడిని త్వరగా గుర్తించి క్షేమంగా తల్లిదండ్రులకుఅప్పగించడంతో రాయచోటి అర్బన్ పోలీసులపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# 31న ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా

ఇందిరాపార్కు వద్ద ఈ నెల 31న చేపట్టనున్న మహాధర్నాకు అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలను ఆహ్వానిస్తున్నామని లోక్ ఆందోళన్ న్యాస్ వర్కింగ్ ప్రసి డెంట్ కల్పనా ఇనామ్ దార్ తెలిపారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ జనగణన కులగణనలో ఓబీ సీలకు ప్రత్యేక కాలం ఇవ్వాలని, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్కోటా విధించాలని, న్యాయ వ్యవస్థలో సంస్క రణలు తీసుకురావాలని, డి లిమిటేషన్లో రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య న్యాయ ప్రచార ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఇందిరాపార్కు ధర్నాతో తెలంగాణలో ఈ ఉద్యమాన్ని ప్రారంభించి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాధి శిల్పా, రాఘవలింగం తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విగ్రహానికి ఘనంగా పుష్పాంజలి

తిరుపతి, 2026 ఆగస్టు 21 భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న వెంగమాంబ విగ్రహానికి తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా. వేమ వెంకటరత్నం శుక్రవారం ఘనంగా పుష్పాంజలి ఘటించారు. వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి హరికథ గానం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వెంగమాంబ ప్రాజెక్టు ఏఈవో అరుణకుమారి, సూపరింటెండెంట్ ఎన్ సుశీల, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా వైభవంగా వరలక్ష్మి వ్రతం

రాయచోటి. వాడవాడల శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు వైభవంగా జరుపుకున్నారు. ఉదయం వేళ నుంచి మహిళలు తమ గృహాలలో వరలక్ష్మి అమ్మవారిని కొలువు తీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని రకరకాలుగా సర్వాంగ సుందరంగా తమ శక్తి మేరకు అలంకరణ చేసి ఆభరణాలు మెండుగా అలంకరణ చేశారు. సౌభాగ్యము, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మహిళలు వరలక్ష్మి తల్లిని వేడుకొన్నారు. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు .అన్నమయ్య జిల్లాలో సంబేపల్లిలోని దేవర రాయి నల్ల గంగమ్మ తల్లి .పశుపతి నాథ ఆలయం. రాయచోటి లోని వీరభద్ర స్వామి దేవాలయం. వాసవి కన్యకా పరమేశ్వరి .చెక్ పోస్ట్ శివాలయం ,తంబళ్లపల్లె, మదనపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలలో అన్ని పల్లెల్లో కూడా ఈ ఏడాది వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా మదనపల్లెలోని బెంగళూరు రోడ్డులోని శివాలయము, బజారు వీధిలోని అమ్మవారి శాల భక్తులతో పోటెత్తాయి. సంబేపల్లిలోని మహిమాన్ నిత్యమైన శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయంలో వైభవంగా వరలక్ష్మి వ్రతంభక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు.. అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం సిరిసంపదలకు, సౌభాగ్యానికి, సుఖశాంతులకు ప్రతీకగా భావించే వరలక్ష్మీదేవి ఆరాధనను పురస్కరించుకుని సంబేపల్లె శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో పులకించింది. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవిని ఆరాధించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేదమంత్రాలు నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. మహిళలు సంప్రదాయబద్ధంగా వ్రతాన్ని ఆచరించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, నైవేద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. అమ్మవారి కృప కోసం సామూహిక వ్రతం×వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వరలక్ష్మీదేవిని ఆరాధించడం ద్వారా కుటుంబంలో శుభమంగళాలు, సిరిసంపదలు వెల్లివిరుస్తాయని భక్తుల విశ్వాసం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లువ్రతానికి హాజరైన ప్రతి మహిళకు ఆలయం తరఫున పసుపు, కుంకుమ, రవిక బట్ట, గాజులు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూనాసి సుబ్బరాజు యాదవ్ , ఈఓ దేవదాసు, అర్చకులు అరుణాచలం మాట్లాడుతూ.. వరలక్ష్మీ వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారని తెలిపారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలని.. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆనందం నిండాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ వరలక్ష్మి వ్రతం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కందూరి నాగేశ్వర్ నాయుడు. రాష్ట్ర బంజారా సంఘ్ నాయుకులు జయరాం అఖండ నాయక్ ఆలయ కమిటీ డైరెక్టర్ లు అంచల రఘు. ఆంజనేయులు మురగేష్. వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారుసాయంత్రం వేళ దీపాలతో అమ్మవారిని మరొకమారు రకరకాల పుష్పాలతో అలంకరణ చేసి పద్లు, రకరకాల వంటలతో నైవేద్యాలు సమర్పించారు. మహిళలను తమ గృహాలకు ఆహ్వానించి వారికి అమ్మవారి దీవెనలతో పాటు పసుపు కుంకుమ జాకెట్ ను సమర్పించారు. ఏది ఏమైనా ఒకపక్క కరువు పీడిస్తున్న వరలక్ష్మి వ్రతం పండగ భారమైన మహిళలు ఈ ఏడాది వరలక్ష్మీ వ్రతాన్ని తమ శక్తి మేరకు ఘనంగా జరుపుకున్నారు.

## ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో దారుణ హత్య..

బద్వేలు నియోజకవర్గం కలసపాడు మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామ సమీప పొలంలో శుక్రవారం దారుణ హత్య జరిగింది. ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు (62) అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు దారుణంగా చంపారు. లింగమయ్య స్వామి కొండ సమీపంలోని తన పొలం వద్ద ఉండగా ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. హత్య అనంతరం ఆయన జేబులో ఉన్న రూ. 90 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆర్థిక వివాదాలా, పాత కక్షలతో సొంత బంధువులే ఈ దారుణానికి పాల్పడ్డారా? లేక కేవలం నగదు కోసమే దుండగులు హత్య చేశారా అనే కోణంలో కలసపాడు ఎస్సై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలి. భరోసా కల్పించాలిమంత్రి వాకిటి శ్రీహరి

రాజేంద్ర నగర్ ఎల్ నినో ప్రభావం- వివిధ ప్రభుత్వ రంగాల్లో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణపై రాజేంద్ర నగర్ లో వర్క్ షాప్ జరిగింది. వర్క్ షాప్ లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసిరి సీతక్క, వాకిటి శ్రీహరి లు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు, వ్యవసాయ, పంచాయతీ రాజ్, పశు సంవర్ధక మత్స్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గతంలో కూడా దేశంలో ఎల్ నినో ప్రభావాలు వచ్చాయి. 1951 నుంచి నేటి వరకు 12సార్లు ఎల్ నినోను భారత దేశం ఎదుర్కొంది.

కరువును ఎలా ఎదుర్కోవాలనే అవగాహన రైతులకు ఉంటుంది కానీ ఆ అవగాహనను ఆచరించేలా చేసే బాధ్యత మనది. పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావచ్చనే విషయంలో రైతులకు సలహాలు ఇవ్వాలని అన్నారు.

ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణ ద్వారా ఎల్ నినోను సమర్థవంతంగా అధిగమించింది. కరవు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణ వంటి వాటిపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి. ఎల్ నినో విషయంలో దేశంలోనే తెలంగాణ మాత్రమే ఇలాంటి ముందస్తు కార్యక్రమం హర్షించదగ్గ విషయం. ఎలాంటి కరవు పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందుకు సాగేవాడు రైతు. పంటల దిగుబడి రాకున్నా వ్యవసాయం మాత్రం వదలడు. అటువంటి రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలి. భరోసా కల్పించాలి. రైతులను కరువు నుంచి బయట పడవేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరం. చేపల పెంపకానికి నీరు తప్పనిసరి. చెరువుల్లో చేపల పెంపకం జరుగాలంటే అక్కడ ఉన్న రైతుల నుంచి నీటి సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. వర్షాల ద్వారా వచ్చే నీటిని చెక్ డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేసి వ్యవసాయ రంగానికి వాడుకోవాలి. మేకలు, గొర్రెలు మేసేందుకు ప్రత్యేక ప్రదేశాలను గుర్తించి, కేటాయించడం ద్వారా పశు సంపదను పెంచుకోవచ్చు. మన ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో తెలంగాణను ఒక మోడల్ గా నిలుపవచ్చు. ఎల్ నినో వంటి వాటిని ఎదుర్కోనేందుకు అధికారులు అప్రమత్తతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని సంపూర్ణం చేయాలి. ముందస్తు ప్రణాళికతో రైతులకు మంచి అవకాశం కల్పించి ఎల్ నినోను సమర్థవంతంగా ఎదుర్కోవాలని అన్నారు.

# ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

కాకినాడ గోదావరి నదిలో దూకిన ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసారు. నిందితుడు సాదిక్ఖాన్ కోసం 10 ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. సాధిక్ ఖాన్ పాస్పోర్టును సీజ్ చేసి నిందితుడు ఎక్కడికీ పారిపోకుండా లుకౌట్ సర్క్యులర్ జారీ చేసారు. నూకరాజు కుమార్తె రాసిన లేఖలపై దర్యాప్తు ముమ్మరం. మతం మారాలి ఇస్లాం పుస్తకాలు చదవాలంటూ సాధిక్ ఖాన్ వేధించినట్లు లేఖలో సౌజన్య పేర్కొంది. సాధిక్ ఖాన్ కాల్డేటా ఆధారంగా పలువురిని పోలీసులు విచారించారు. పోలీసులు. నిందితుడు సాదిక్ఖాన్ ఆచూకీ తెలిపితే రివార్డ్ ఇస్తామని ప్రకటించారు.

# అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలు

హైదరాబాద్ ఆటోమెషన్, డిజిటలైజేషన్, అధునాతన ఇంజినీరింగ్ టెక్నాలజీ తయారీ రంగం అత్యంత కీలకమని ఏస్ అర్బన్ గ్రూప్, ఏఎం గ్రీన్ డైరె క్టర్ స్వాతి చలమలశెట్టి అన్నారు. మాదాపూర్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన హింటెక్స్ (హైదరాబాద్ ఇంటర్నేషనల్ మెషిన్ టూల్ అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్) 2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏస్ అర్బన్ గ్రూప్, ఏఎం గ్రీన్ డైరెక్టర్ స్వాతి చలమలశెట్టి విచ్చేసి హైటెక్స్ డైరెక్టర్ కునశంకర్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హింటెక్స్ వంటి పారిశ్రామిక ప్రదర్శనలు ఆధునిక సాంకేతికతను భారతీయ పరిశ్రమలకు చేరువ చేయడంతో పాటు, సంస్థలు తమ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాలను అన్వేషించేందుకు కీలకంగా నిలుస్తున్నట్లు చెప్పారు. హింటెక్స్ గత కొన్నేళ్లుగా దేశంలోని అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రదర్శనల్లో ఒకటిగా ఎదిగినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో హింటెక్స్ లేథ్, సీఎన్సీ యంత్రాలు, మ్యాచినింగ్ సెంటర్లు, ఎలక్ట్రిక్ డిశ్చార్జ్ మెషిన్లు, హైడ్రాలిక్, మెకానికల్, న్యూమాటిక్ ప్రెస్లు, షీరింగ్, బెండింగ్ ప్రెస్లు, మెటల్ ఫార్మింగ్ మెషిన్ టూల్స్, డ్రిల్లింగ్, బోరింగ్ వంటి యంత్ర పరికరాలను ప్రదర్శించారు.

## అన్ని జిల్లాల కలెక్టర్లతో తో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

సిద్దిపేట హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ , పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పెండింగ్ భూసేకరణకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నుండి జిల్లా కలెక్టర్ కె. హైమావతి, నీటి పారుదల శాఖ ఎస్ఈ, డిఈ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

అవనిగడ్డ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా అవనిగడ్డ, పులిగడ్డ రహదారిపై చోటుచేసుకుంది. పులిగడ్డ రహదారిపై సీతాయలంక వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వ్యాగన్ఆర్ కారును ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. దాంతో అతడు ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయాలైన మహిళను మెరుగైన చికిత్స నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు మోపిదేవి మండలం నాగయతిప్పకు చెందిన కంఠమనేని అప్పారావు (65) గా గుర్తించారు. నాగాయ తిప్పకు చెందిన వారు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అవనిగడ్డ ఇంచార్జ్ ఎస్ఐ చాణక్య ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు మానవతారాయ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేత మానవతారాయ్ సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. బాధితుడిగా సిట్ అధికారులు ఇచ్చిన నోటీసుల మేరకు బషీర్బాగ్లోని సీసీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మానవతారాయ్ నుంచి సిట్ అధికారులు వివరాలు, వాంగ్మూలం నమోదు చేసారు.

# ఎంపి ఈటల పర్యటన

కొల్లూరు గ్రామంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటించారు. పారిశ్రామిక కంపెనీల వ్యర్థాలతో కలుషితమైన నీటితో కుంటలు మరియు చెరువులు కాలుష్య కూపంగా మారి అందులో ఉన్న చేపలు మరియు నీటి తాగనీకి వచ్చే పశు సంపద ఇతర వన్యప్రాణులు మృతి చెందుతున్నాయని తెలియడంతో చెరువు దగ్గరికి వెళ్ళి స్వయంగా పరిశీలించిస్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రాకుండా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు కూడా ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకొని కలుషిత నీళ్ళు బయటికి రాకుండా చూసుకోవలసిన బాధ్యత వారి మీద ఉందని లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ జీడిమెట్ల కెమికల్ ఇండస్ట్రీ ఏరియా, జీనోమ్ వాలీ, తుర్కపల్లి, జవహర్ నగర్ డంప్ యార్డు నుంచి వచ్చిన మురుగునీరు, వాసన వల్ల ఈ ప్రాంత ప్రజల జీవనం దుర్భరంగా మారింది. – వీచే గాలి విషం అయ్యింది.– చర్మం దద్దుర్లు, ఊపిరితిత్తుల వ్యాధులు, అబార్షన్లు, క్యాన్సర్, పశువులు ప్రెగ్నెంట్ అవ్వడం లేదు.– ఒక్కమాటలో చెప్పాలంటే వీరు నరకంలో బ్రతుకుతున్నారు.– ఇవి మురికి కూపాలు కావు, ప్రాణాలు తీస్తున్న నరక కూపాలుగా మారాయి. – ఇంత టెక్నాలజీ వచ్చినా, నిబంధనలు వచ్చినా రసాయన వ్యర్థాలను అరికట్టలేక పోతున్నారు. – ప్రతి పరిశ్రమలో ట్రీట్మెంట్ ప్లాంట్ పెట్టాలి కానీ కొద్దిమంది ఫార్మా కంపెనీల యాజమాన్యాలు బోర్లు వేసి ఆ రసాయన వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నారు. డ్రైనేజీ లలో వదిలి పెడుతున్నారు.

# తెలంగాణ సాంకేతిక విద్యకు కొత్త దిశ.. ఇండస్ట్రీ 4.0కు యువశక్తి

**(హెచ్.ప్రతాప్)**

తెలంగాణ వేగంగా పారిశ్రామిక, ఐటీ, ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాల్లో ముందుకు సాగుతున్న నేపథ్యంలో సాంకేతిక విద్యా వ్యవస్థను భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం అత్యవసరం. ఇంజినీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు కేవలం డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్లు అందించే సంస్థలుగా కాకుండా ఇండస్ట్రీ 4.0కు సిద్ధమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆటోమేషన్, డేటా అనలిటిక్స్, 3డీ ప్రింటింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలు పరిశ్రమల స్వరూపాన్ని వేగంగా మారుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ూజం) ఆధునీకరిస్తోంది. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.2,380 కోట్ల పెట్టుబడి ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. ఆధునిక వర్క్‌షాప్‌లు, కొత్త పరికరాలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య కోర్సులతో ఐటీఐ విద్యార్థులను భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఆరు దీర్ఘకాలిక, 23 స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా శిక్షణను సంప్రదాయ ట్రేడ్‌ల పరిధి దాటి ఆధునిక సాంకేతికత వైపు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

ఇది మంచి ఆరంభమే అయినప్పటికీ, ఐటీఐల ఆధునీకరణతో సాంకేతిక విద్యా సంస్కరణలు పూర్తికావు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలల మౌలిక వసతులను కూడా సమూలంగా మెరుగుపరచాలి. ఆధునిక ప్రయోగశాలలు, కంప్యూటింగ్ సదుపాయాలు, పరిశోధనా కేంద్రాలు, హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ, పరిశ్రమలతో సంయుక్త ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ఖాళీగా ఉన్న బోధనా పోస్టులను వేగంగా భర్తీ చేయడం అత్యంత కీలకం. అత్యాధునిక పరికరాలు ఉన్నా వాటిని సమర్థంగా ఉపయోగించే నైపుణ్యం కలిగిన అధ్యాపకులు లేకపోతే ప్రయోజనం పరిమితంగానే ఉంటుంది.

ప్రభుత్వ సాంకేతిక సంస్థలను ప్రైవేట్ సంస్థలకు ప్రత్యామ్నాయంగా కాకుండా నాణ్యతలో వాటితో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలి. ప్రతి విద్యార్థికి పరిశ్రమ ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, పరిశ్రమ నిపుణుల మార్గదర్శకత్వం అందాలి. అధ్యాపకులకు కూడా నిరంతరంగా ఇండస్ట్రీ 4.0 సాంకేతికతలపై శిక్షణ ఇవ్వాలి. పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు, ఇంజినీరింగ్ కళాశాలలు, పరిశ్రమలు, నైపుణ్య విశ్వవిద్యాలయాల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడాలి.

ప్రభుత్వ సంస్థల్లో చదివే విద్యార్థికి ప్రైవేట్ సంస్థకు వెళ్లాల్సిన అవసరం ఎందుకు ఉండకూడదు? అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చేలా నాణ్యత పెరగాలి. విద్యార్థికి సర్టిఫికెట్ మాత్రమే కాకుండా నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, పరిశ్రమ అనుభవం, ఉపాధి సామర్థ్యం లభించినప్పుడే సాంకేతిక విద్య నిజమైన ఫలితాన్ని ఇస్తుంది.

తెలంగాణకు అవసరమైనది కేవలం ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే యువత కాదు; రేపటి పరిశ్రమలను నడిపించే, కొత్త సాంకేతికతను సృష్టించే, ప్రపంచంతో పోటీపడగల నైపుణ్య శక్తి. అందుకు సాంకేతిక విద్యా వ్యవస్థలో ఇప్పుడే పెట్టుబడి పెట్టడం భవిష్యత్ తెలంగాణకు అత్యంత కీలకమైన పెట్టుబడి.

# మంత్రి కొండా సురేఖ పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం హాట్ కామెంట్స్




హైద్రాబాద్ ఆగస్ట్ 21 ; కొండా సురేఖ నియోజకవర్గం దాటితే ఆమెకు ఎవ్వరు ఓట్లు కూడా వేయరు

కేటీఆర్, హరీష్ రావు ఎంకరేజ్ చేస్తేనే కొండా సురేఖ మాట్లాడుతుంది

తల్లి సురేఖ ,తండ్రి మురళి కలిసి సుస్మిత తో మాట్లాడిస్తున్నారు

సుస్మిత నీ బిడ్డ కదా

ఆస్థులన్ని బిడ్డకు ఇవ్వట్లేదా?

ంతీం లో కొండా సురేఖ, మురళి ఏమి సంపాదించారో మాకు తెలుసు

కాంగ్రెస్ పార్టీ కి కొండా సురేఖ చేసిన శ్రమ ఏంటి?

కొండా సురేఖ ఎప్పుడైనా పార్టీ కోసం జైల్ కు పోయిందా?

పక్క జియోజకవర్గంలో ఒక్క ఎమ్మెల్యేను గెలిపించావా సురేఖ?

సుస్మిత పిల్ల కాదు

ఆమె అనుభవ శాలి

సీఎం రేవంత్ రెడ్డి 24 గంటలు పార్టీ కోసం కష్ట పడ్డడు

పార్టీని బ్రతికించాలని ఆలోచిస్తున్నారు

కష్ట పడ్డ నాయకున్ని విమర్శిస్తారా?

పార్టీ కోసం కష్టపడ్డది పీసీసి అధ్యక్షుడు గా రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి

వీళ్లు అందరూ కష్ట పడితే కొండ సురేఖ పదవి అనుభవిస్తుంది

ఎన్నికల ముందు వరకు కొండా సురేఖ్ తీం లో ఉంది

హై కమాండ్ కు లాయల్ గా ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు

కార్యకర్తలు శ్రమిస్తేనే కొండా సురేఖ గెలిచింది అని గుర్తుపెట్టుకోవాలి

గెలిచి పార్టీకి కొండా సురేఖ చేసింది ఏంటి

ఎవరైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందే

రేవంత్ రెడ్డి సోనియాగాంధీ ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆదేశాలతో నిద్ర పోకుండా రాష్ట్ర వ్యాప్తంగా తిరిగాడు

గడీలను బద్దలు కొట్టిండు రేవంత్ రెడ్డి అని గుర్తించుకోవాలి.

# ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతులపై కాంగ్రెస్ అనవసర రాజకీయం మానుకోవాలి

ఆగ్రహం -- రీఫండ్‌కు డిమాండ్:లి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాశీచందర్ రావు**




హైద్రాబాద్ ఆగస్ట్ 21: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాశీచందర్ రావు గారు మాట్లాడారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతుల వ్యవహారంతో పాటు మెడికల్ విద్యార్థుల ఫీజుల సమస్యలపై ఆయన కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

బీజేపీలోకి ప్రముఖ వైద్యుల చేరిక:లి

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ పోస్ట్ గ్రాడ్యుయేట్, క్యాన్సర్ రిహాబిలిటేషన్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ విజయేందర్ గారిని, అలాగే ఎల్బీ నగర్ మేఘనా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రమోద్ గారిని శ్రీ ఎన్. రామచందర్ రావు గారు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కమిటీలను నిర్మించి విశేష సేవలందిస్తున్న డాక్టర్ విజయేందర్ గారు, తోటి వైద్యులందరి మద్దతును బీజేపీకి సమీకరిస్తూ పార్టీలో చేరడం ఎంతో శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతులపై స్పష్టత:లి

ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వకపోవడం వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదని శ్రీ ఎన్. రాశీచందర్ రావు గారు స్పష్టం చేశారు. సీఎంతో పాటు వెళ్లే అధికారుల ప్రతినిధి బృందానికి పెట్టుబడులు, ఒప్పందాల కోసం సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇప్పటికే కేంద్రం అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధంగా ముఖ్యమంత్రులు లేదా మంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లే సమయంలో ఆ పర్యటన అధికారిక ఆవశ్యకత, ఆహ్వానించిన సంస్థల నేపథ్యం, హాజరయ్యే వ్యక్తుల స్థాయి, అంతర్జాతీయ ప్రోటోకాల్, డిప్లొమాటిక్ అంశాలు, భద్రతా ఏర్పాట్లు, ఎఫ్‌సీఆర్‌ఏ (ఫీజ=ూ) నిబంధనలు తదితర కీలక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకుంటుందని వివరించారు.

గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2012లో నాటి అస్సాం కాంగ్రెస్ ముఖ్యమంత్రి తరుణ్ గొగొయ్ అమెరికా, ఇజ్రాయెల్ పర్యటనలను, అలాగే జార్ఖండ్ నాటి బీజేపీ సీఎం అర్జున్ ముండా థాయిలాండ్ పర్యటనను కేంద్రం తిరస్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతేకాకుండా నాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ నరేంద్ర మోదీ గారికి అమెరికా వీసా రాకుండా కాంగ్రెస్ ఎంపీలు, నాయకులు కుట్రపూరితంగా లేఖలు రాసిన చరిత్రను గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి గారు గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు కేంద్రం ఎలాంటి అడ్డంకులు సృష్టించలేదని, తాజా పర్యటనకు సంబంధించిన నిబంధనలు, విధివిధానాల లోపాల ప్రకారమే నిర్ణయం జరిగిందని, దీనిని రాజకీయం చేయవద్దని హెచ్చరించారు.

ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజు దోపిడీపై నీట్ ద్వారా ప్రవేశాలు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి ప్రైవేట్ మెడికల్ కాలేజీలు అక్రమంగా ఫీజులు వసూలు చేయడంపై శ్రీ ఎన్. రాశీచందర్ రావు గారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నర సంవత్సరాల కోర్సు ఫీజును ఐదు వాయిదాలలో చెల్లించాలని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (ూాఫీ=జ) నిర్దేశించినప్పటికీ, కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్ల పూర్తి ఫీజును వసూలు చేస్తూ ఒక్కో విద్యార్థి కుటుంబంపై ?13 లక్షల నుండి ?20 లక్షల వరకు అదనపు భారం మోపాయని మండిపడ్డారు. విద్యార్థుల నుండి అదనంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే వాపస్ చేయాలని టీఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ గోపాల్ రెడ్డి గారితో పాటు హైకోర్టు కూడా స్పష్టమైన తీర్పులిచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఐవీజు) తక్షణమే జోక్యం చేసుకుని ఆయా ప్రైవేట్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఫీజులు రీఫండ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుల పక్షాన బీజేపీ నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని డిమాండ్ చేశారు.

# పింక్ గులాబ్ ? ది హెరిటేజ్ ఎడిట్

హైదరాబాద్‌లో 'పింక్ గులాబ్ ? ది హెరిటేజ్ ఎడిట్' ప్రదర్శన ప్రారంభమైంది. ప్రముఖ నటి, సామాజిక వ్యాపారవేత్త అమల అక్కినేని ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఆగస్టు 21, 22 తేదీల్లో బంజారాహిల్స్ లో క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో ఈ ప్రదర్శన కొనసాగనుంది.భారతీయ చేనేతలు, సిల్క్ వస్త్రాలు, కాంతా ఎంబ్రాయిడరీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, సంప్రదాయ కళలు, హస్తకళా ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులు, నేత కార్మికులు, డిజైనర్లు, స్వదేశీ బ్రాండ్లను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ప్రదర్శన ప్రత్యేకత. సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు మార్కెట్ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# వనపర్తి బీసీ హాస్టల్‌లో బియ్యం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

**46 క్వింటాళ్లకు బదులు 25 క్వింటాళ్లు మాత్రమే? 15 క్వింటాళ్ల "హ్యాండ్ లోన్"పై స్పష్టత ఇవ్వాలి**

**పంచనామా ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**పిడిఎస్ యు బిసి పొలిటికల్ జే ఏసీ బంజారా గిరిజన విద్యార్థి సమైక్య డిమాండ్**






వనపర్తి, ఆగస్ట్ 21 ;వనపర్తి ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల భోజనం కోసం కేటాయించిన బియ్యం విషయంలో తీవ్రమైన అనుమానాలు, వ్యత్యాసాలు వెలుగులోకి వచ్చాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, పిడిఎస్ యు బిసి పొలిటికల్ జే ఏసీ బంజారా గిరిజన విద్యార్థి సమైక్య నాయకులు తెలిపారు.

హాస్టల్‌కు 46 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా 25 క్వింటాళ్ల బియ్యం మాత్రమే తీసుకువచ్చినట్లు తమకు లభించిన సమాచారం, ప్రాథమిక పరిశీలనలో వెల్లడైందని వారు తెలిపారు. ఈ వ్యవహారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కి ఫిర్యాదు చేయడంతో, వారి ఆదేశాల మేరకు వనపర్తి తహసీల్దార్ హాస్టల్‌కు చేరుకుని సంబంధిత రికార్డులు, బియ్యం నిల్వలను పరిశీలిస్తూ పంచనామా నిర్వహించినట్లు తెలిపారు.

పంచనామాలో నమోదు చేసిన వివరాల ప్రకారం, 13-08-2026న 15 క్వింటాళ్ల బియ్యాన్ని "హ్యాండ్ లోన్"గా తీసుకున్నట్లు హాస్టల్ వార్డెన్ నరేందర్ రెడ్డి పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు. అయితే సంబంధిత గోదాం అధికారులను సంప్రదించినప్పుడు, హాస్టల్‌కు 15 క్వింటాళ్ల బియ్యాన్ని హ్యాండ్ లోన్‌గా ఇచ్చినట్లు తమ వద్ద ఎలాంటి రికార్డు లేదని గోదాం సిబ్బంది తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

అసలు 15 క్వింటాళ్ల బియ్యం ఎక్కడికి వెళ్లింది?

గోదాం రికార్డుల్లో జారీ వివరాలు లేకపోతే, 15 క్వింటాళ్ల బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలించబడింది? ఎవరు స్వీకరించారు? ఎక్కడ వినియోగించారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని పిడిఎస్ యు బిసి పొలిటికల్ జే ఏసీ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కే పవన్ కుమార్ దేవర శివ గౌడ్ టౌన్ ప్రెసిడెంట్, మహేందర్ నాయుడు, ధర్మేందర్, రాజు, బాలవర్ధన్, బంజారా గిరిజన విద్యార్థి శివ నాయక్ నేడొక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అలాగే పంచనామాలో నమోదు చేసిన బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్, గోదాం జారీ వివరాలు, రవాణా వాహన వివరాలు, హ్యాండ్ లోన్‌కు సంబంధించిన రికార్డులు అన్నింటినీ పరస్పరం సరిపోల్చి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు..

విద్యార్థుల భోజన బియ్యంపై అక్రమాలకు తావు లేదు

ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కేటాయిస్తున్న బియ్యం పేద విద్యార్థుల హక్కు అని, ఆ బియ్యంలో ఒక్క కిలో కూడా పక్కదారి పట్టకుండా అధికారులు కఠిన పర్యవేక్షణ చేయాలని నాయకులు అన్నారు.

46 క్వింటాళ్లకు బదులు 25 క్వింటాళ్లు మాత్రమే ఎందుకు వచ్చాయి?

15 క్వింటాళ్ల హ్యాండ్ లోన్‌కు గోదాం రికార్డు ఎక్కడ ఉంది?

బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్ ఎందుకు సరిపోవడం లేదు?

బియ్యం రవాణా వివరాలు ఏమిటి?

బాధ్యత ఎవరిది?

అనే ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

21-08-2026న నిర్వహించిన పంచనామాను ఆధారంగా తీసుకుని సమగ్ర విచారణ జరపాలి.

హాస్టల్ మరియు గోదాం స్టాక్ రిజిస్టర్లను క్రాస్ వెరిఫై చేయాలి. 15 క్వింటాళ్ల హ్యాండ్ లోన్ వ్యవహారంపై గోదాం రికార్డులను పరిశీలించాలి.

బియ్యం రవాణాకు సంబంధించిన వాహనం, డ్రైవర్, రవాణా మరియు డెలివరీ వివరాలను పరిశీలించాలి.

గత కాలానికి సంబంధించిన బియ్యం స్టాక్, ఇండెంట్, మెస్ వినియోగం, డైట్ బిల్లులను కూడా ఆడిట్ చేయాలి.

విచారణలో అక్రమాలు రుజువైతే సంబంధిత బాధ్యులపై శాఖాపరమైన మరియు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు తేలితే బాధ్యుల నుంచి నష్టపరిహారం/రికవరీ చేయాలి.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సరిపడా బియ్యం నిరంతరం అందేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి.

"విద్యార్థుల కడుపు నింపాల్సిన బియ్యం పక్కదారి పట్టడానికి వీల్లేదు. పంచనామాలో వెలుగులోకి వచ్చిన అంశాలపై నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు చేసిన వారు ఎవరైనా సరే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారాన్ని అధికారులు తేలికగా తీసుకోకుండా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలి" అని డిమాండ్ చేశారు.

# సమ్మక్క--సారలమ్మ కథ ఆధారంగా పాన్-ఇండియా సినిమా...




ప్రముఖ నిర్మాణ సంస్థ మాస్ట్రో క్రియేషన్స్ (meastro creations)తెలంగాణ ఆరాధ్య వనదేవతల సమ్మక్క--సారలమ్మ వీరగాథ నిజ జీవిత చరిత్ర ఆధారంగా భారీ బడ్జెట్ పాన్-ఇండియా చారిత్రాత్మిక చిత్రాన్ని రూపొందిస్తున్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, వీరత్వం మరియు భావోద్వేగాలను అద్భుతమైన విజువల్ అనుభూతిగా మార్చే లక్ష్యంతో ఈ చిత్రం రూపొందుతోందని చిత్ర దర్శకుడు వెంకట్ తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్, ప్రీ-విజువలైజేషన్, వర్చువల్ ప్రొడక్షన్, గ్రాఫిక్స్ వంటి కీలక విభాగాల కోసం ఖఖ,ఖూ వంటి దేశాల్లోని ప్రముఖ స్టూడియోలతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. ప్రతిష్ఠాత్మక నటీనటులను ఎంపిక చేసి, రాబోయే సమ్మక్క--సారలమ్మ మహా జాతర సమయానికల్లా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రణాళిక చేస్తున్నారని ఆయన తెలిపారు. త్వరలోనే పూర్తి వివరాలు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# ఈ రహదారికి మోక్షం ఎప్పుడో

## నిలిచిపోయిన రహదారి పనులు
## ఈ దారి వెంబడి ప్రయాణించాలంటే జంకుతున్న జనం

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 21 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** పుల్కల్,అందోల్, మండలాలను కలిపె జాతీయ రహదారి 161, సంగుపేట, ఎక్స్ రోడ్ నుండి, ఎస్,ఇటిక్యాల, ముదిమాణిక్యం, బస్వాపూర్, ముద్దాయి పేట్, చౌరస్తా వరకు ఉన్న రోడ్డును, గత (బిఆర్ఎస్) ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో రహదారులను పట్టించుకోకపోవడంతో, ఈ రోడ్డు గుంతల మాయమై ప్రానంతకంగా మారింది, పలుమార్లు ఈ రోడ్డు విషయమై (ప్రజాబలం) పత్రికలో కథనాలు వస్తే, మంత్రి దామోదర్ రాజనర్సింహ, చోరవతో, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్కు పనులు అప్పజెప్పింది, సదురు కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల క్రితం రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశాడు, దీంతో ఈ రోడ్డు మీద ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, కంకర రోడ్డు మీద ఉన్నటువంటి డస్ట్ కళ్ళల్లో



పడి గాయాలపాలై దవాఖానాలకు లక్షలు వెచ్చించుకున్నారు, అయినా రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం స్పందించక ఈ రోడ్డును అలాగే వదిలేసింది, దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వచ్చింది, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఈ సంగుపేట, ఎక్స్ రోడ్ నుండి ముద్దాయిపేట్ చౌరస్తా, వరకు, ఉన్న రోడ్డు కోసం 40 కోట్లు మంజూరు చేశారు, దీంతో పనులు ప్రారంభించిన అధికారులు, సంగుపేట్, ఎక్స్ రోడ్ నుండి, ఎస్, ఇటిక్యాల,వరకు రోడ్డుకు వన్ సైడ్ జెసిబి తో మొత్తం కంకర తీసి, సంగుపేట,శివారులో పోతిరెడ్డిపల్లి, శివారులో రెండు చోట్ల రోడ్డుకు ఉన్నటువంటి కల్వర్టుకు పైపులు కల్వర్టు నిర్మించి, ఎస్,ఇటిక్యాల, వద్ద కల్వర్టు కోసం పైపులు వేసి వదిలేశారు, రోడ్డు పనులు నిలిపివేశారు, ఈ రోడ్డు పనులు నిలిపివేసి ఇప్పటికీ 25 రోజులు అవుతుంది, ప్రయాణికులు ప్రయాణించాలంటే నాన్న ఇబ్బందులు పడుతున్నారు, మరి రోడ్డు పనులు ఎందుకు ఆపివేశారో తెలియదు అసలు రోడ్డు పూర్తవుతుందా కాదా మధ్యలోనే నిలిపివేస్తారా అనే సందేహంలో ప్రజలు నిరుత్సాహపడుతున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డు పనులు కొనసాగించాలని పుల్కల్ మండల ప్రజలు ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

# చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్...రూ.2.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

## వివరాలు వెల్లడించిన వైరా సిఐ




**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 21 ప్రజాబలం:**తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు ఇంటి చోరీ కేసులను తల్లాడ పోలీసులు ఛేదించారని, ఈ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వైరా సిఐ వెంకటప్రసాద్ తెలిపారు.

రెండు ఇంటి చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న జంగాల స్వరూప్ కుమార్ ఏ శాంతి స్వరూప్ ఏ వినయ్ కుమార్, వయస్సు 41 సం,,ను శు క్రవారం ఉదయం తల్లాడ బస్ స్టాండ్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు.



ఏప్రిల్ 11న గంగదేవిపాడు గ్రామానికి చెందిన సిలివేరు నరసింహారావు వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లగా, ఆయన భార్య కూలి పనికి వెళ్లారు. మద్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిన నరసింహారావు ఇంటి వాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోని ఇనుప బీరువాను కూడా పగులగొట్టి, అందులో భద్రపరిచిన బంగారు ఆభరణాలు చోరికి గురైనట్లు గుర్తించి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విదారించగా, గంగదేవిపాడు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి, తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇనుప బీరువాను పగులగొట్టి బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు వెల్లడించాడు.

అదేవిధంగా...తల్లాడ ఎస్సై

ఎన్.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో

నిర్వహించిన నిందితుడి విచారణలో తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడు తల్లాడలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి, ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి రెండు బంగారు ఉంగరాలను చోరీ చేసినట్లు వెల్లడించాడని తెలిపారు. అనంతరం ఆ బంగారు ఉంగరాలను గన్నవరం ప్రాంతంలోని ఎస్సార్ బంగారం దుకాణంలో విక్రయించినట్లు విచారణలో తెలిపారన్నారు.

నిందితుడి నేర చరిత్ర...

దర్యాప్తులో నిందితుడికి గతంలో కూడా పలు చోరీ, ఇంటి దొంగతనం కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అతనిపై నమోదైన పాత కేసుల వివరాలను సంబంధిత పోలీస్ రికార్డుల ద్వార పరిశీలించినట్లు,

నిందితుడి ప్రమేయం ఉన్న ఇతర ఆస్తి నేరాలను కూడా గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పంచుల సాక్షుల సమక్షంలో చట్టపరమైన విధానంలో స్వాదీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గౌరవ న్యాయస్థానం ఎదుట రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.

తల్లాడ పోలీసుల విజ్ఞప్తి చేశారు

ప్రజలు ఇళ్లను ఖాళీగా ఉంచి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను ఇంట్లో బహిరంగంగా ఉంచకుండా తగిన భాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో సొరుగువారికి సమాచారం ఇవ్వడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా చోరీలను నివారించవచ్చని తెలిపారు.

### పంట పొలాల్లో బోరు మోటర్లు, కాపర్ వైర్లు దొంగతనం చేస్తున్న నిందితుడి అరెస్ట్
### రూ.1.30 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

సి. బెళగల్ కర్నూలు జిల్లా సి. బెళగల్, గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంట పొలాల్లో బోరు మోటర్లు, కాపర్ వైర్లు దొంగతనం చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.1.30 లక్షల విలువైన 600 మీటర్ల కాపర్ వైరు, మూడు బోరు మోటర్లను స్వాధీనం చేసుకున్నారు.పంట పొలాల్లో ఏర్పాటు చేసిన బోరు మోటర్లు, కాపర్ వైర్లు పగలు, రాత్రి సమయాల్లో చోరీకి గురైన ఘటనలపై సి. బెళగల్, గూడూరు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల దర్యాప్తును కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. తబ్రేజ్ పర్యవేక్షణలో సి. బెళగల్ ఎస్ఐ యు. వేణుగోపాల్ రాజు, పోలీసు సిబ్బంది చేపట్టారు.దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సి. బెళగల్ గ్రామంలోని మోడల్ స్కూల్ వెనుక వైపు ఉన్న కంప చెట్ల వద్ద గుండ్రేవుల గ్రామానికి చెందిన నిందితుడు కాప పాలచి రెడ్డి (43), తండ్రి వీర రెడ్డి, పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుడి వద్ద నుంచి సుమారు 600 మీటర్ల కాపర్ వైరు, మూడు బోరు మోటర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.1,30,000గా పోలీసులు తెలిపారు.

# విమర్శనాత్మక వార్తలపై జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు సరికాదు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 21 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా** :ప్రభుత్వాన్ని విమర్శిస్తూ జర్నలిస్టులు వార్తలు లేదా కథనాలు రాశారనే కారణంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛను గౌరవించాలని పేర్కొంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(ఏ) కింద జర్నలిస్టుల హక్కులు రక్షించబడతాయని దేశ అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. కేవలం ఒక జర్నలిస్టు రాసిన కథనం ప్రభుత్వంపై విమర్శగా కనిపించిందనే కారణంతో అతనిపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని వ్యాఖ్యానించింది.ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్, తనపై నమోదైన (ఎఫ్ఐఆర్‌ను) కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టునుఆశ్రయించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని అధికారుల నియామకాల్లో కుల సమీకరణాలపై ఆయన రాసిన కథనం నేపథ్యంలో ఎఫ్ఐఆర్ నమోదైంది.ఈ పిటిషన్‌ను జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్.వీ.ఎన్. భట్టితో కూడిన ధర్మాసనం విచారించింది.పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తూ సంబంధిత కథనానికి సంబంధించి ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ఉత్తర్వులు జారీ చేసింది.....

# మడికొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్



వరంగల్ సెంట్రల్ జోన్ పరిధిలోని మడికొండ పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, శుక్రవారం సందర్శించారు. ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ పూల మొక్కను అందజేశారు.

అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు, స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో తరచుగా అధిక సంఖ్యలో నమోదవుతున్న నేరాలు, పరిధిలోని గ్రామాలు, ఆయా గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వేణును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీసులు ప్రజల కోసం పనిచేస్తున్నారని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు తప్పనిసరిగా రశీదు అందజేయాలని, ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్‌లో ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

# అతిథి ఆధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

## ప్రిన్సిపల్ డాక్టర్, బి.రేణుక




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 21** ఏటూరు నాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరు నాగారం లో బీకాం ( బి ఎఫ్ ఎస్ ఐ) సబ్జెక్టులో అతిథి అధ్యాపకులు గా పనిచేయడానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్, బి.రేణుక పేర్కొన్నారు.

ఎం కామ్ సంబంధిత సబ్జెక్ట్ లో 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్ట్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దీనికి అర్హులని, ఎస్టీ, ఎస్సీ వర్గానికి చెందిన అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్ట్ లో 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. పిహెచ్ డి, నెట్,సెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.అదే విధంగా డిగ్రీ స్థాయిలో బోధన అనుభవం కలిగి ఉన్న వారికి వెయిటేజ్ ఉంటుందని అన్నారు. పై అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాల తో కూడిన బయోడేటా ను,అన్ని సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను ఈనెల 24తేదీసోమవారంసాయత్రం 4.గం, లోపు కళాశాల లో సమర్పించగలరని పేర్కొన్నారు. వీరికి డెమో, ఇంటర్వ్యూ, బోధన అనుభవం,విద్యా అర్హతల ఆధారంగా ఎంపిక చేయబడుతుందని తెలిపారు.

# జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ఆదర్శ చెస్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ





**జహీరాబాద్, ఆగస్టు 21 ప్రజాబలం ప్రతినిధి:** సంగమిత్ర స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీల్లో ఆదర్శ చెస్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో మొత్తం 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదర్శ చెస్ అకాడమీ నుంచి శ్రీనిధితో పాటు పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన చీఫ్ ఆర్బిటర్ రాజేందర్ మరియు ఆర్బిటర్ విజ్ఞాన్ రాష్ట్ర స్థాయి ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు కుష్వంత్ బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులు చెస్‌లో మరింతగా రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదర్శ చెస్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల అకాడమీ నిర్వాహకులు, కోచ్‌లు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇటీవల మృతి చెందిన బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ నాయకులు.



**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి ఆగస్టు 21 ఏటూరు నాగారం** బిమంత్రి దనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలోని 7వ వార్డుకు చెందిన కంకణాల నారాయణ ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు.

బిపెద్దకర్మ కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు భరోసా కల్పించారు.బిఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు,జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న,జిల్లా సెక్రటరీ ఎండీ ఖలీల్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్, టౌన్ అధ్యక్షులు కే. రంజిత్, వార్డ్ మెంబెర్ ఉమ్మనేని రమేష్,మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వ సాయి,చింతకింది రాజు,టౌన్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ల తరుణ్, ఆటో యూనియన్ అధ్యక్షులు ఇర్సవడ్ల కిరణ్, బొగ్గుల సునీల్, కంకణాల రఘు, గాడిచర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు

# కోదండ రామస్వామి ఆలయానికి శంకుస్థాపన

### ఆధ్యాత్మిక కేంద్రంగా కేతవీరునిపాడు

### కోదండ రామస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

"ఎమ్మెల్యే సౌమ్య" కేతవీరునిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న కోదండ రామస్వామి దేవస్థానానికి శుక్రవారం శంకుస్థాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి హాజరై ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా "ఎమ్మెల్యే సౌమ్య" మాట్లాడుతూ : కోదండ రామస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రముఖ సినీ నటి షావుకారు జానకి మృతి పట్ల మంత్రి నారా లోకేష్ సంతాపం

అమరావతి నటి షావుకారు జానకి మృతి పట్ల మంత్రి నారా లోకేష్ సంతాపం ప్రకటించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాలకు పైగా నటించి.. తన తొలి సినిమా 'షావుకారు' పేరునే ఇంటిపేరుగా మార్చుకున్నారు. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. సినీ రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. జానకి గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. జానకి గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు.

# నేరాల నియంత్రణకు సాంకేతికతను వినియోగించాలి

## హద్నూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



**జహీరాబాద్, ఆగస్టు 21 ప్రజాబలం ప్రతినిధి:** నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం హద్నూర్ పోలీస్ స్టేషన్, జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. హద్నూర్ పీఎస్‌లో గౌరవ వందనం స్వీకరించిన అనంతరం డీఎస్పీ సైదా నాయక్‌తో కలిసి మొక్క నాటారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్ తదితర సాంకేతిక వ్యవస్థలపై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో పగలు, రాత్రి బీట్





విధుల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. జహీరాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ.. కీలక కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా, నాకాబందీని కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అధికారుల, సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని అభినందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

# ఏటూరునాగారం లో ఆరోగ్య బ్లడ్ డయాగ్నస్టిక్స్ కేంద్రం ప్రారంభం..

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 21 ఏటూరు నాగారం** బిఏటూరునాగారం: మండల కేంద్రంలోని వి మార్ట్ పక్కన శంకరాజుపల్లి గ్రామానికి చెందిన తాటిపెల్లి పవన్ ఏర్పాటు చేసిన ఆరోగ్య బ్లడ్ డయాగ్నస్టిక్స్ (రక్త పరీక్షల) కేంద్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు.





ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు డయాగ్నస్టిక్స్ కేంద్రాన్ని సందర్శించి, ప్రజలకు నాణ్యమైన రక్త పరీక్షల సేవలు అందించాలని ఆకాంక్షించారు..

ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, సర్పంచులు కావేరి అర్జున్, గద్దల నవీన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కర్నె సత్యం, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వ సాయి, పడిదల హన్మంత్, గజ్జెల అంకుల్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు...

## ఐదేళ్లు నెత్తురు పారించి... జగన్ రెడ్డి ఇప్పుడు నీతులు చెబుతున్నాడు

### టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్

మంగళగిరి రాష్ట్ర ప్రజలందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేస్తూ.. గతంలో అధికార బలంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర అరాచకాలు సృష్టించిన గొడ్డలిపార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు 'స్వాతిముత్యంలాగా' నటిస్తూ ఎన్నికల్లో యుద్ధం చేద్దాం అనడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయానికి కార్యకర్తలు ఎవరైనా స్వేచ్ఛగా రావచ్చని, కానీ వైసీపీ ఆఫీసుకు కేవలం ఎంపిక చేసుకున్న కొద్దిమందిని మాత్రమే అనుమతించే పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. అలాంటి కొద్దిమందిని కూర్చోబెట్టుకుని.. గంజాయి బ్యాచ్లకు, హత్యలు చేసేవారికి, గొడ్డళ్లతో విన్యాసాలు చేసేవారికే టికెట్లు ఇస్తామని చెప్పే రీతిలో జగన్ ఆలోచనలు ఉన్నాయని మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాలు ప్రజలందరికీ గుర్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడా పోటీ ఉండకూడదని, వీలైనన్ని ఎక్కువ ఏకగ్రీవాలు చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు లక్ష్యాలు పెట్టి అరాచకాలు చేయించింది జగన్ కాదా అని ప్రశ్నించారు. ఆనాడు ప్రజాస్వామ్యాన్ని కాలరాసి బలవంతపు ఏకగ్రీవాలు చేసుకుని, నేడు అధికారం పోయాక ఏమీ ఎరగనట్లు 'స్వాతిముత్యంలాగా' మాట్లాడుతూ 'యుద్ధం చేద్దాం, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే మనదే విజయం' అనడం దొంగ ఇంట్లోని కుక్క పోలీసులను చూసి మొరిగినట్లు ఉందని ఎద్దేవా చేశారు. జగన్ పాలన రాష్ట్రానికి అరిష్టమని భావించే గత ఎన్నికల్లో ప్రజలు ఆయన పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో విజ్ఞులని, ఒకసారి వదిలించుకున్న దరిద్రాన్ని మళ్లీ తెచ్చుకునేందుకు సిద్ధంగా లేరని అన్నారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక.. ఆటోనగర్ ఏర్పాటుకు వినతి




**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 21:** సత్తుపల్లిలోని చేయూత మోటారు ఆటో మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా ఎస్.కె. నజ్మోద్దీన్, సుభాని ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా టి. సురేష్, క్రాంతి కుమార్, గణేష్, రహంతుల్లా, మహ్మద్ రఫీ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శంకరాచారి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.కె. ఉస్మాన్, షరీఫ్, సుభాని, వీరభద్రరావు, జె. అబీయుల్లా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎం. ఏడుకొండలు మాట్లాడుతూ.. ఆటో మెకానిక్ వర్కర్ల సంక్షేమం కోసం సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. వర్కర్లు తమ వృత్తిని సౌకర్యవంతంగా నిర్వహించుకునేందుకు సత్తుపల్లిలో ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సంఘ సభ్యుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు వినతి

సత్తుపల్లి పట్టణంలోని ఆటో మెకానిక్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరుతూ నూతన కార్యవర్గం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

ఆటో మెకానిక్ వర్కర్ల సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అనంతరం కలెక్టర్, తహసీల్దార్‌తో కలిసి ఆటోనగర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించి, త్వరలో సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

తమ సమస్యపై సానుకూలంగా స్పందించి పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర, ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, రెవెన్యూ అధికారులకు చేయూత మోటారు ఆటో మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సంఘం అభివృద్ధితో పాటు ఆటో మెకానిక్ వర్కర్ల సంక్షేమానికి ఐక్యంగా పనిచేస్తామని అధ్యక్షుడు ఏడుకొండలు తెలిపారు.

# అన్నారుగూడెంలో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులకు శ్రీకారం.

**వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సైడ్ డ్రైనేజీలకై పరిశీలన మాజీ ఎంపీపీ**

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టితో పటిష్ట చర్యలు -సర్పంచ్ గొడ్ల ప్రభాకర్.**

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 21 ప్రజాబలం:** అన్నారుగూడెంలో గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యం,మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అన్నారుగూడెం గ్రామంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వర్షాకాలంలో రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా,నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా సైడ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకు పంచాయతీరాజ్ ఏఈతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు.



గ్రామంలోని సమస్యాత్మక ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన దొడ్డ శ్రీనివాసరావు,వర్షపు నీటి పారుదలకు అనుకూలంగా డ్రైనేజీ నిర్మాణాలకు అవసరమైన ప్రదేశాలను గుర్తించి, పనుల ప్రణాళికపై అధికారులతో చర్చించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన కలుపు ముందు స్ప్రే పంపును ప్రారంభించిన సర్పంచ్ :

అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలోని పిచ్చి మొక్కలు,గడ్డి తదితరాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గడ్డి మందు పిచికారి చేసే పంపును ప్రారంభించారు. గ్రామంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.గ్రామ అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు.

# ఆర్డీవో అజయ్ యాదవ్‌కు బీసీ సంఘం ఘన సన్మానం..



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 21:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి, ఐఏఎస్ అధికారి అజయ్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, అజయ్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, పరిపాలనను మరింత పారదర్శకంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాలని ఆర్డిఓ అజయ్ యాదవ్‌ను ఆకాంక్షించారు.

కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పు హనుమంతు, కల్లూరు టౌన్ అధ్యక్షుడు బయ్యారపు నరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెలి శ్రీనివాసరావు, యువజన సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కోమటి తిరుమలరావు, పెనుబల్లి మండల అధ్యక్షుడు కర్రి కమలాకర్, కల్లూరు మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, బాలకృష్ణ, బొడ్డు కృష్ణ, ఎస్.కె. బాజీతో పాటు సంఘం ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైరాలో సత్రం బజారుకు మరమ్మత్తులు .. మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 21 ప్రజాబలం:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని వర్షాల కారణంగా సత్రం బజారులో ఉన్న రోడ్లను12..13 వార్డ్ లో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మత్తు కంకరపోయుటకు సిద్ధం చేసి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు

సిబ్బంది కలిసి పర్యవేక్షించారు మున్సిపల్ ఏఈ పలు సూచనలు తో సత్రం బజార్ నుండి కె వి సి ఎం కాలేజీ వరకు ఎక్కడ గుంతలు ఉన్న కంకర తో నింపాలని ఆమె సూచించారు బురద మయంతో ఉన్న రోడ్లను ప్రత్యేక శ్రద్ధతో మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ పరిశీలించటం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ అధ్యక్షులు కాపా మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వీరం శెట్టి సీతారాములు, ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బెడిసికొట్టిన అభిషేక్ లాతూర్ స్కూలు సందర్శన

అభిజీత్ లాతూర్‌లోని ఒక పాఠశాలను సందర్శించారు. అయితే అక్కడ విద్యార్థులు దాదాపు ఎవరూ లేరు. ముందుగానే మీడియాను పిలిపించడంతో, కెమెరాల ముందు చూపించేందుకు విద్యార్థులు అవసరమయ్యారు.దీంతో ఆయన బృందం మరో పాఠశాల నుంచి పిల్లలను తీసుకొచ్చి మీడియా ముందు కూర్చోబెట్టి వారికి భోజనం కూడా పెట్టింది. అయితే ఒక గ్రామస్థుడు అక్కడే వారిని ప్రశ్నిస్తూ, "ఈ పిల్లలు ఈ పాఠశాలకు చెందినవారు కాదు, మరో స్కూల్‌కు చెందినవారు" అని చెప్పడంతో విషయం బయటపడింది.దీంతో మీడియా ఎదుటే ఈ వ్యవహారం బహిర్గతమైంది. ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండటంతో అభిజీత్ కొద్దిసేపు ఏమి మాట్లాడాలో అర్థంకాక ఇబ్బంది పడి తల పట్టుకున్నాడు వీడియోలో కనిపించింది...

# వరలక్ష్మీ వ్రతంతో శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో ఆధ్యాత్మిక శోభ

**భక్తిశ్రద్ధలతో విశేష పూజలు.. మహిళా భక్తులతో కిటకిటలాడిన మహాలక్ష్మి ఆలయం**

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 21:** శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తిశ్రద్ధలతో సందడిగా మారాయి.





ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి ఆలయ అర్చకులు ఉదయం, సాయంత్రం చతుష్షష్టి ఉపచారాలతో విశేష పూజలు, ఏకాంత సేవలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి షోడశోపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.మహిళా భక్తుల ప్రత్యేక పూజలు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా అమ్మవారిని కొలిచారు. ఓడి బియ్యం, గాజులు, చీరెసారెలతో వాయనాలు సమర్పించి, కుంకుమ పూజలు నిర్వహించారు. కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సిరిసంపదలు సమృద్ధిగా కలగాలని కోరుకుంటూ అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతానికి విశేష ప్రాధాన్యత ఉండటంతో సమీప ప్రాంతాల నుంచి కూడా మహిళా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తులు క్రమపద్ధతిలో అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎండ, వర్షం నుంచి భక్తులకు రక్షణ కల్పించేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. భక్తులు ప్రశాంతంగా పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు.

పూలు, తోరణాలతో ఆలయానికి ప్రత్యేక అలంకరణ వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మీ ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మామిడి ఆకుల తోరణాలు, కొబ్బరి ఆకులు, రంగురంగుల పూలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పుష్పాలంకరణతో ఆలయ ప్రాంగణం ఆకర్షణీయంగా మారగా, ప్రత్యేక పూజలు, దీపాలంకరణతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావన మరింత పెరిగింది.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయానికి భక్తుల రాక కొనసాగింది. మహిళా భక్తుల భక్తిగీతాలు, పూజా కార్యక్రమాలు, అమ్మవారి నామస్మరణలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించు కున్నాయి. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా విశేష పూజలు విజయవంతంగా నిర్వహించడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# మాసబ్‌ట్యాంక్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులతో వివేక్ వెంకటస్వామి ముఖాముఖి

## ఆందోళనలకు కారణాలు అడిగి తెలుసుకుని.. సందేహాలను నివృత్తి చేసిన మంత్రి





హైదరాబాద్, ఆగస్టు 21: హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థుల వద్దకు శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ ఒ ఫ్యాక్టరీలు) మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెళ్లి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాలిటెక్నిక్‌లను శక్తి శాఖ పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలు, అపోహలు, ఆందోళనలను మంత్రి ఓపికగా విని.. ఒక్కొక్క అంశంపై స్పష్టత ఇచ్చారు. విద్యార్థుల విద్య, ఫీజులు, పరీక్షలు, డిప్లొమా గుర్తింపు, ఈసెట్, లేటరల్ ఎంట్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్టైఫండ్ వంటి అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానమిస్తూ.. ఇప్పటికే చదువుతున్న విద్యార్థుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదని భరోసా ఇచ్చారు. అలాగే పాలిటెక్నిక్‌లలో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక విద్య, పరిశ్రమలతో అనుసంధానం, మెరుగైన ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి -- విద్యార్థుల మధ్య జరిగిన సంభాషణ ఇలా సాగింది.

పాలిటెక్నిక్ విద్యార్థులు -- మంత్రి వివేక్ వెంకటస్వామి మధ్య సంభాషణ

విద్యార్థుల ప్రశ్న: పాలిటెక్నిక్‌లను 'శక్తి' శాఖలోకి మార్చడం వల్ల మా చదువులు, సర్టిఫికెట్లు, పరీక్షల్లో ఏమైనా మార్పులు వస్తాయా?

మంత్రి వివేక్ వెంకటస్వామి: ఎలాంటి మార్పులు ఉండవు. మీరు ప్రస్తుతం ఏ విధంగా చదువుతున్నారో అదే విధంగా కొనసాగుతుంది. ఏఐసీటీఈ గుర్తింపు, పరీక్షలు, డిప్లొమా సర్టిఫికెట్ అన్నీ కొనసాగుతాయి. మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

విద్యార్థుల ప్రశ్న: మా ఫీజులు పెరుగుతాయా?

మంత్రి: ఫీజు విషయంలో ఎలాంటి మార్పు ఉండదు. ప్రస్తుతం ఉన్న ఫీజు నిర్మాణమే కొనసాగుతుంది. అంతేకాదు, విద్యార్థులకు స్టైఫండ్ అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. మీపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూస్తాం.

ప్రశ్న: ఈసెట్ పరీక్ష ఉంటుందా? మేము బీటెక్‌లోకి లేటరల్ ఎంట్రీ ద్వారా వెళ్లగలమా?

మంత్రి: ఖచ్చితంగా ఈసెట్ పరీక్ష ఉంటుంది. ఇప్పటివరకు ఉన్న విధానమే కొనసాగుతుంది. ఈసెట్ ద్వారా బీటెక్‌లో రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే అవకాశం కూడా కొనసాగుతుంది. దీనిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. అవసరమైతే దీనిపై స్పష్టత ఇస్తూ ప్రత్యేక జీవో కూడా తీసుకొస్తాం.

ప్రశ్న: మేము డిప్లొమా పూర్తి చేసిన తర్వాత మా సర్టిఫికెట్‌కు విలువ తగ్గుతుందా?

మంత్రి: అసలు తగ్గదు. ప్రస్తుతం మీ డిప్లొమాకు ఉన్న గుర్తింపు, విలువ పూర్తిగా కొనసాగుతుంది. భవిష్యత్తులో ఆ విలువను మరింత పెంచాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం. స్కిల్ యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి మీకు మరిన్ని అవకాశాలు కల్పించాలనుకుంటున్నాం.

ప్రశ్న: పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరణ చేస్తారని మాకు భయం ఉంది. నిజంగా ప్రైవేటీకరణ జరుగుతుందా?

మంత్రి: ప్రైవేటీకరణ అనే ప్రశ్నే లేదు. పాలిటెక్నిక్‌లు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. గవర్నమెంట్ కంట్రోల్‌లోనే విద్య, పరీక్షలు, ఫీజులు, విద్యార్థుల ప్రయోజనాలు కొనసాగుతాయి. పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలనుకుంటున్నది ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక శిక్షణ, సీఎస్ఆర్ నిధులు తీసుకురావడం కోసం మాత్రమే.

ప్రశ్న: పరిశ్రమలను భాగస్వామ్యం చేస్తే భవిష్యత్తులో ప్రైవేట్ సంస్థల నియంత్రణకు వెళ్లే అవకాశం ఉండదా?

మంత్రి: ఉండదు. ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు, సాంకేతిక సహకారం తీసుకుని పాలిటెక్నిక్‌లను అభివృద్ధి చేస్తాం. మీ విద్యకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుంది.

ప్రశ్న: మా ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిస్థితి ఏమవుతుంది?

మంత్రి: ప్రస్తుతం మీకు ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం కొనసాగుతుంది. పాలిటెక్నిక్‌లు ఒక ప్రభుత్వ శాఖ నుంచి మరో ప్రభుత్వ శాఖ పరిధిలోకి వెళ్లడం వల్ల విద్యార్థులకు ఉన్న ప్రయోజనాలు తొలగిపోవు.

ప్రశ్న: ఇప్పటికే పాలిటెక్నిక్‌లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమవుతుంది?

మంత్రి: ఇప్పటికే అడ్మిట్ అయిన విద్యార్థుల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవు. మీరు ఏ కోర్సులో చేరారో అదే కోర్సును పూర్తి చేస్తారు. మీ పరీక్షలు, సిలబస్, సర్టిఫికెట్లు, ఫీజులు అన్నీ కొనసాగుతాయి.

ప్రశ్న: మా సిలబస్‌లో మార్పులు చేస్తారా?

మంత్రి: ప్రస్తుతం ఉన్న కోర్సులు కొనసాగుతాయి. అయితే భవిష్యత్తులో కొత్త పరిశ్రమలు, కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా కొత్త కోర్సులు తీసుకురావచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆ కొత్త కోర్సులను ఎంచుకోవచ్చు. ఇప్పటికే ఉన్న కోర్సులను తొలగించి మీపై బలవంతంగా కొత్త కోర్సులు రుద్దే పరిస్థితి ఉండదు.

ప్రశ్న: మా ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయా?

మంత్రి: తగ్గవు.. పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల కొన్ని రంగాల్లో ఉద్యోగాల స్వభావం మారుతోంది. అందుకే కొత్త టెక్నాలజీలపై శిక్షణ ఇచ్చి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను మీకు అందించాలనుకుంటున్నాం. దాని వల్ల మీకు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

ప్రశ్న: పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ఎంత నిధులు ఖర్చు చేయబోతోంది?

మంత్రి: పాలిటెక్నిక్‌లను ఆధునీకరించేందుకు సుమారు రూ.600 నుంచి రూ.800 కోట్ల వరకు నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త పరికరాలు, సౌకర్యాలు, ఆధునిక సాంకేతిక శిక్షణ అందించేలా పాలిటెక్నిక్‌లను అభివృద్ధి చేస్తాం.

ప్రశ్న: ఆ నిధులు ఎందుకు శక్తి శాఖ నుంచి రావాలి?

మంత్రి: పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి నిధులు అవసరం. శక్తి శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత ఆ శాఖ ద్వారా నిధులు సమకూర్చి పాలిటెక్నిక్‌లను అభివృద్ధి చేయాలన్నది మా ఆలోచన. శాఖ మారినంత మాత్రాన మీ విద్యలో మార్పు ఉండదు. పైగా మీకు అదనపు నిధులు, మెరుగైన సౌకర్యాలు అందే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: మాకు స్టైఫండ్ వస్తుందని చెబుతున్నారు. ఎంత వస్తుంది?

మంత్రి: విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా స్టైఫండ్ అందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కూడా విద్యార్థులకు రూ.2,000 స్టైఫండ్ అందించే అంశాన్ని ప్రకటించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా ఈ ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

ప్రశ్న: భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వం ఈ నిర్ణయాలను మార్చేస్తే మా పరిస్థితి ఏంటి?

మంత్రి: ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంగా మేము మీ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఉన్న జీవోలు కొనసాగుతాయని అధికారులు కూడా స్పష్టం చేశారు. మీకు ఉన్న హక్కులు, భద్రత ఎక్కడా దెబ్బతినకుండా చూస్తాం.

ప్రశ్న: మాటలతో కాకుండా జీవో ద్వారా హామీ ఇవ్వగలరా?

మంత్రి: తప్పకుండా. మీకు ఏ అంశంపై స్పష్టత కావాలో చెప్పండి. అవసరమైన చోట జీవోలోనే స్పష్టమైన నిబంధనలు పొందుపరుస్తాం. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిది. మీకు అనుమానం ఉంటే నన్ను నేరుగా సంప్రదించండి.

ప్రశ్న: మాకు ఇంతకుముందు ఈ విషయాలపై స్పష్టత లేకపోవడం వల్లే ఆందోళన చెందుతున్నాం.

మంత్రి: మీ ఆందోళన నాకు అర్థమవుతోంది. కొత్తగా శాఖ మారుతుందని తెలిసినప్పుడు సందేహాలు రావడం సహజం. అందుకే నేను స్వయంగా మీ ముందుకు వచ్చి మాట్లాడుతున్నాను. మీ సమస్యలు ఏమైనా ఉంటే ఒక్కొక్కటిగా చెప్పండి. చర్చిద్దాం.. పరిష్కరిద్దాం.

ప్రశ్న: చివరగా పాలిటెక్నిక్ విద్యార్థులకు మీరు ఏం చెప్పాలనుకుంటున్నారు?

మంత్రి: మీ భవిష్యత్తు బాగుండాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం. మీకు ఎక్కడా నష్టం జరగదు. ఫీజులు, పరీక్షలు, డిప్లొమా గుర్తింపు, లేటరల్ ఎంట్రీ, సిలబస్, ఇప్పటికే ఉన్న విద్యార్థుల ప్రయోజనాలు.. ఏ విషయంలోనూ మీకు ఇబ్బంది కలిగేలా నిర్ణయం తీసుకోం. పైగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల సహకారం, కొత్త కోర్సులు, మెరుగైన మౌలిక సదుపాయాలతో మీకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే మా లక్ష్యం.

ప్రశ్న: అంటే మా భవిష్యత్తు గురించి భయపడాల్సిన అవసరం లేదంటారా?

మంత్రి: అసలు భయపడాల్సిన అవసరం లేదు. మీ భవిష్యత్తుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. మీకు ఏమైనా సందేహం ఉంటే నేరుగా అడగండి. నేను మంత్రిగా మీ ప్రతి సమస్యను విని, అవసరమైన చోట పరిష్కారం చూపించేందుకు సిద్ధంగా ఉన్నాను.

ఫ్యాకల్టీ ప్రశ్న: మా స్టాఫ్ జీతాలు, సర్వీస్ కండిషన్స్‌లో మార్పులు వస్తాయా?

మంత్రి: ఎలాంటి మార్పులు ఉండవు. జీతాలు, ప్రమోషన్లు, సర్వీస్ కండిషన్స్ అన్నీ కొనసాగుతాయి. మీరు ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉంటారు. భవిష్యత్తులో అభివృద్ధి పెరిగితే మరిన్ని పోస్టులు, మరిన్ని ప్రమోషన్ అవకాశాలు ఎలా కల్పించాలనే దానిపై కూడా ఆలోచిస్తాం.

## అందమైన గృహానికి అద్భుతమైన ఏషియన్ పెయింట్స్ కలర్స్, నాణ్యమైన ధరలకు అందిస్తున్న రాయల్ ఎలక్ట్రానిక్ ప్రొపరేటర్ మహమ్మద్ గౌసోద్దీన్



వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 21(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం అందమైన గృహానికి అద్భుతమైన కలర్స్ అందిస్తున్న ఏషియన్ పెయింట్స్ రండి కొనండి అద్భుతమైన కలర్స్ తో ఆనందాన్ని ఆస్వాదిద్దాంరాయల్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మొహమ్మద్ గౌసో ద్దీన్ తెలిపారు ఎమ్మార్వో ఆఫీస్ రోడ్ ప్రభుత్వ ఆసుపత్రి గేటు ఎదురుగా మీకు నచ్చేలా మీరు మెచ్చేలా అందమైన కలర్స్అద్భుతమైన కలర్స్ మీ ముందు ఉంచబడ్డాయి అని తెలిపారు క్వాలిటీ విషయంలో నెంబర్ వన్ నాణ్యమైన అద్భుతమైన కలర్స్ రాయల్ ఎలక్ట్రానిక్ షాప్ లో కలర్స్ ఉన్నాయని తెలిపారు మర్పల్లి మండలం పెయింటింగ్ కాంట్రాక్టర్ నారాయణరెడ్డి అద్భుతమైన కలర్స్ నాణ్యమైన ధరలకే లభిస్తాయని తెలిపారు

## జగన్ పై రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ వ్యంగ్యాస్త్రాలు

అమరావతి మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్ పై రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు, డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీకి తేడా తెలియని జగన్ గురించి అన్ని జనరేషన్స్ ఆలోచన చేయాలి. పబ్లిక్ సర్వీస్ పరీక్ష లో సర్వీస్ అనే పదాన్ని హోటల్ సర్వీస్ అనుకుని మూల్యాంకనం రిసార్ట్ లో పెట్టినట్టు ఉన్నాడని అన్నారు. ప్రజాస్వామ్యంలో 4పిల్లర్లు ఉంటాయనే విషయం కూడా తెలియని వ్యక్తి 5పిల్లర్లు ముఖ్యమంత్రి గా చేయటం ఖర్మ కాక మరేంటి. ఏపీపీఎస్సీ కి డీఎస్సీ కి తేడా తెలియని వాడు, రాజ్యాంగం తెలియని వాడు కాబట్టే అసెంబ్లీ కి రానంటున్నాడు. గ్రూప్ 1 ఉద్యోగాల విలువ తెలియక హైల్యాండ్ లో పేపర్లు దిద్దించి పెద్ద కుంభకోణానికి పాల్పడ్డాడు. డీఎస్సీ నిర్వహించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన దమ్మున్న నాయకుడు లోకేషని అన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు: హైదర్ నగర్ ఏఈ మాధురి

మియాపూర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఆగస్టు 21 శనివారం రోజు నిర్వహణ పనుల నిమిత్తం ఈ క్రింది ప్రాంతాలలో విద్యుత్ కోత విధిస్తున్నట్లు మాధురి ఒక ప్రకటనలు పేర్కొన్నారు. 1) మయూరి నగర్ ఎస్ ఎస్ నుండి 11కేవీ మయూరి నగర్ ఫీడర్ పరిధి: మయూరి నగర్, ఎస్ ఎస్ ఎస్బిఐ బ్యాంక్ రోడ్, ఆర్య టవర్స్ రోడ్, వృద్ధాశ్రమం రోడ్ సమయం: 15:00 నుండి 15:30 గంటల వరకు 2) మయూరి నగర్ ఎస్–ఎస్ నుండి 11కేవీ రామ్ నరేష్ నగర్ ఫీడర్ పరిధి: మిత్ర హిల్స్, ప్రశాంత్ నగర్, ఏవి స్ రాజు నగర్, వృద్ధాశ్రమం సమయం: 15:00 నుండి 15:30 గంటల వరకు 3)మయూ రి నగర్ ఎస్ ఎస్ నుండి 11ఏవి కేటీఆర్ ఫీడర్ పరిధి: కేటీఆర్ కాలనీ, జున్రమ్ (జన్ రూమ్) ఫేజ్-1 ప్రాంతం సమయం: 10:30 నుండి 11:00 గంటల వరకు 4) మియాపూర్ చౌరస్తా రోడ్ ఎస్ ఎస్ నుండి 11 కె.వి శ్రీల గార్డెన్స్ ఫీడర్ పరిధి: శ్రీల గార్డెన్స్, నాడిగడ్డ తండా, హై టెన్షన్ లైన్ ప్రాంతం, సుభాష్ చంద్రబోస్ నగర్ సమయం: 11:30 నుండి 12:00 గంటల వరకు 5) హెచ్ఎంటి హిల్స్ ఎస్ ఎస్ నుండి 11కేవీ నందమూరి నగర్ ఫీడర్ పరిధి: నందమూరి నగర్, హైదర్‌నగర్ గ్రామం, నిజాంపేట్ మెయిన్ రోడ్ సమ యం: 11:00 నుండి 12:00 గంటల వరకు 6) హెచ్ఎంటి హిల్స్ ఎస్ ఎస్ నుండి 11కేవీ సెవెన్ హిల్స్ ఫీడర్ పరిధి: సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్,నాగార్జున హోమ్స్, నిజాం పేట్ మెయిన్ రోడ్ ప్రాంతం సమ యం: 11:00 నుండి 12:00 గంటల వరకు 7) హెచ్ఎంటి హిల్స్ ఎస్ ఎస్ నుండి 11కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధి: బృందావన్ కాలనీ, జున్రమ్ (జెన్ రూమ్) ఫేజ్-2 సమయం: 11:00 నుండి 12:00 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని ఐదోన్నర అయ్యి మాధురి తెలియజేశారు.

## షావుకారు జానకి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

హైదరాబాద్ ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు.పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com